12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 10 సంచిక : 27 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ ఆదివారం 27 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME 10 ISSUE :27 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SUN 27 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## 10 శాతం వృద్ధి సాధ్యమే

### టెక్నాలజీపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పెట్టుబడులతోనే దేశానికి ఉజ్వల భవిష్యత్తు
- ఏఐ, సెమీకండక్టర్లకు భారీగా నిధులు కేటాయించాలని సూచన
- చిన్న పరిశ్రమల్లోనూ ఏఐ వాడకం పెరగాలని వ్యాఖ్య

- మిగతా 2లో

## పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి.. 11 మంది మృతి



- పాకిస్థాన్‌లో పోలీసు చెక్‌పోస్ట్‌పై ఆత్మాహుతి దాడి
- ఈ ఘటనలో 11 మంది మృతి, 30 మందికి గాయాలు
- పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వెల్లడి
- దాడికి బాధ్యత ప్రకటించుకున్న తెహ్రీక్-ఇ-తాలిబన్

- మిగతా 2లో



## కర్నూలులో ఏవియేషన్ అకాడమీ రావడం చరిత్రాత్మకం

- ఏవియేషన్ సెంటర్ ను ప్రారంభించిన ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ
- పైలట్లకు డిమాండ్ విపరీతంగా పెరుగుతుందన్న మంత్రి
- ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేయబోతున్నట్టు బీసీ జనార్దన్ ప్రకటన

- మిగతా 2లో

# భారీ వర్షాలతో ఉత్తరాంధ్ర అతలాకుతలం..

## అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు

- భారీ వర్షాలు, వరద పరిస్థితిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- వేటకు వెళ్లలేని మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం పంపిణీకి ఆదేశం
- ప్రకాశం బ్యారేజీకి ఎగువ, దిగువన కొత్త బ్యారేజీల నిర్మాణ ప్రతిపాదనలు
- తాజా వర్షాలతో రాష్ట్రంలోని జలాశయాల్లోకి 21 టీఎంసీల అదనపు నీరు
- రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గుదల



పెన్ పవర్ డెస్క్:గత కొద్దిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో కురుస్తున్న భారీ వర్షాలు, వరద పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, వేటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకార కుటుంబాలకు తక్షణ సాయంగా 50 కేజీల బియ్యం అందించాలని ఆదేశించారు. అదే సమయంలో కృష్ణా నదిపై రెండు కొత్త బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను వేగవంతం చేయాలని అధికారులకు కీలక సూచనలు చేశారు.శనివారం జరిగిన ఈ సమీక్షలో అధికారులు రాష్ట్రంలోని తాజా పరిస్థితిని సీఎంకు వివరించారు. ఉత్తరాంధ్రలో నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, పలుచోట్ల నివాస ప్రాంతాలు, పంట పొలాలు నీట మునిగాయని తెలిపారు. సహాయక చర్యలపై ఆరా తీసిన ముఖ్యమంత్రి, ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని స్పష్టం చేశారు. ఐదు రోజులుగా సముద్రంలోకి వెళ్లలేని మత్స్యకారుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వారికి అండగా నిలవాలని, తక్షణమే బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు.

**కృష్ణాపై కొత్త బ్యారేజీలు.. నీటి భద్రతపై దృష్టి**

ఈ సందర్భంగా స్థానికంగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రకాశం బ్యారేజీకి వరద నీరు పెరుగుతోందని అధికారులు తెలపగా, ఆ నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేసుకునే మార్గాలపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పులిచింతల-ప్రకాశం బ్యారేజీ మధ్య ఒకటి, ప్రకాశం బ్యారేజీకి దిగువన మరొకటి చొప్పున రెండు కొత్త బ్యారేజీల నిర్మాణం అవసరమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి గతంలో రూపొందించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారు. అలాగే, హిర మండలం లిఫ్ట్ ప్రాజెక్టుకు విద్యుత్ సౌకర్యం కల్పించి, వంశధార నీటిని రిజర్వాయర్‌లోకి తరలించే పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులకు సూచించారు.

- మిగతా 2లో

## ఈసీ ప్రకటనతో అపోహలకు తెరపడింది

- ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం
- ఢిల్లీలో కీలక సమావేశంతో క్లారిటీ ఇచ్చిన ఈసీ
- తమ మధ్య విభేదాలు లేవంటూ సంయుక్త ప్రకటన విడుదల
- సోషల్ మీడియాలో స్పందించిన ఏపీ సీఎం చంద్రబాబు
- రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను గౌరవించాలని పిలుపు
- గెలుపోటములను హుందాగా స్వీకరించడమే నాయకత్వ లక్షణమని ఉద్ఘాటన



పెన్ పవర్ డెస్క్:భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య విభేదాలు తలెత్తాయంటూ వచ్చిన వార్తలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఇవాళ ఓ కీలక సమావేశం సందర్భంగా ఈసీ ఇచ్చిన ఏకగ్రీవ ప్రకటనతో అన్ని అపోహలకు తెరపడిందని ఆయన పేర్కొన్నరు. మన రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను ఈ ప్రకటన మరోసారి స్పష్టం చేసిందని ఎక్స్ వేదికగా శనివారం ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై నెలకొన్న వివాదం

- మిగతా 2లో



## సీఎం విజయ్ నటనను ఇంకా ఆపలేదు: స్టాలిన్

- సీఎం విజయ్‌పై మాజీ సీఎం స్టాలిన్ తీవ్ర విమర్శలు
- ప్రజల ముందు విజయ్ నటన ఇంకా కొనసాగుతోందని ఎద్దేవా
- డీఎంకే పథకాలకే పేర్లు మార్చి అమలు చేస్తున్నారని ఆరోపణ
- సీఎం పదవికి తగిన హుందాతనం చూపాలని హితవు

- మిగతా 2లో

## కాంగ్రెస్‌తో కలవాలనే ఉద్దేశంతోనే జగన్ వైఖరి మార్చుకుంటున్నారా?

- ఓటర్ల జాబితా సవరణపై జగన్ ది ద్వంద్వ వైఖరి అంటూ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఫైర్
- గతంలో కోర్టులో ఒకలా, ఇప్పుడు మరోలా మాట్లాడటమేంటని ప్రశ్న
- ఈసీల నియామకంపై మాట మార్చడం వెనుక ఆంతర్యమేమిటని నిలదీత
- 2029లో కాంగ్రెస్‌తో పొత్తు కోసమే జగన్ వ్యూహాలని ఆరోపణ

- మిగతా 2లో



## ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం..

### ప్రెస్ నోట్, గ్రూప్ ఫొటోతో చెక్ పెట్టిన ఈసీ

- ఈసీలో విభేదాల వార్తలను ఖండించిన పూర్తిస్థాయి కమిషన్
- నిర్ణయాలన్నీ ఏకగ్రీవమేనని స్పష్టం చేసిన ముగ్గురు కమిషనర్లు
- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించిందని వెల్లడి
- పనితీరును మెరుగుపర్చేందుకు అంతర్గత విధానాల్లో కీలక మార్పులు
- ఈసీఐనెట్ పోర్టల్‌పై సమీక్షకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు



పెన్ పవర్ డెస్క్:భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయంటూ గత కొద్ది రోజులుగా వస్తున్న వార్తలను కమిషన్ తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలకు తెరదించుతూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)

- మిగతా 2లో



## పరవాడ ఫార్మా కాలుష్యంపై పవన్ కల్యాణ్ సీరియస్..

### 95 కంపెనీలకు నోటీసులు

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఫార్మాసిటీపై పీసీబీ చర్యలు
- సోషల్ మీడియా ఫిర్యాదు ఆధారంగా కాలుష్యంపై తనిఖీలు
- పరవాడలోని 95 ఫార్మా పరిశ్రమలకు షోకాజ్ నోటీసులు జారీ
- వ్యర్థాల నిర్వహణపై పరిశ్రమలకు కీలక దిద్దుబాటు చర్యల ఆదేశం

- మిగతా 2లో

## ఏపీ, కర్ణాటక పెద్దల ఆజ్ఞలను పాటిస్తూ ఇక్కడి నాణ్యమైన బొగ్గును ఆ రాష్ట్రాలకు తరలిస్తున్నారు



- విద్యుత్ రంగాన్ని రేవంత్ ప్రభుత్వం నాశనం చేసిందన్న జగదీశ్ రెడ్డి
- వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి రేవంత్ డైవర్షన్ డ్రామాలు ఆడుతున్నారని విమర్శ
- విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని డిమాండ్

- మిగతా 2లో

## సీఈసీ రాజీనామా చేయాల్సిందే

### ఈసీ ప్రెస్ నోట్‌పై కాంగ్రెస్ ఫైర్



- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్
- ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని పట్టు
- కోట్లాది మంది ఓటర్ల హక్కును హరించే కుట్ర జరుగుతోందని ఆరోపణ
- ఎన్నికల సంఘం ఇచ్చిన వివరణపై జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు
- యువతను లక్ష్యంగా చేసుకుని జాబితాల నుంచి పేర్లు తొలగిస్తున్నారని ధ్వజం

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### వైసీపీ స్ట్రాటజీ వర్క్ అవుట్ అవుతుందా? అందుకే టీడీపీని టార్గెట్ చేసిందా?

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మెగా డీఎస్సీ చుట్టూ జరుగుతున్న రాజకీయ పోరు తీవ్ర స్థాయికి చేరింది. ఈ అంశం వెనుక వైసీపీ రాజకీయ అస్త్రాలు, వ్యూహాలు ఉన్నాయనే విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా, విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ లక్ష్యంగా మరియు మిత్రపక్షాలైన టీడీపీ–బీజేపీ–జనసేన మధ్య సమతుల్యతను దెబ్బతీసే విధంగా ఈ వివాదాన్ని సజీవంగా ఉంచేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నారా లోకేశ్ లక్ష్యంగా వ్యూహంకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి నియామక ప్రక్రియను వేగవంతం చేసింది. అయితే, నియామకాలు పూర్తయిన తర్వాత ఈ ప్రక్రియలో, ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా, పేపర్ లీకేజీ మరియు టెట్ అర్హతలలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ ఆరోపిస్తోంది. గవర్నర్ కు కూడా ఫిర్యాదు చేశారు. ఎన్ని కేసులు పెట్టినా యుద్ధం ఆగదని జగన్ స్పష్టం చేయడంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎదుట టీడీపీని పలుచన చేయాలని భావిస్తున్నట్లుంది.

**లోకేశ్ ను టార్గెట్ చేయడం ద్వారా...**

విద్యా శాఖకు మంత్రిగా ఉన్న నారా లోకేశ్ ను నేరుగా టార్గెట్ చేయడం ద్వారా ఆయన రాజకీయ ప్రతిష్టను దెబ్బతీయడం వైసీపీ ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది. ఈ వ్యవహారంపై లోకేశ్ రాజీనామా చేయాలని, సీబీఐ దర్యాప్తు జరిపించాలని జగన్ మోహన్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. బీజేపీ ఎదుట టీడీపీని పలుచన చేసే వ్యూహమా? రాజకీయ విశ్లేషకుల ప్రకారం, వైసీపీ ఈ అంశాన్ని ఇంత పెద్ద ఎత్తున లేవనెత్తడం వెనుక కేంద్రంలో ఉన్న బీజేపీ పెద్దల దృష్టిని ఆకర్షించే వ్యూహం కూడా ఉండవచ్చు. పరిపాలనా లోపాలను ఎత్తిచూపడంతో అవినీతి రహిత, పారదర్శక పాలన అందిస్తామని కేంద్రానికి హామీ టీడీపీ ఇచ్చింది. రాష్ట్రంలో మొదటి పెద్ద రిక్రూట్‌మెంట్‌లోనే అక్రమాలకు పాల్పడిందనే ఇంప్రెషన్‌ను బీజేపీ హైకమాండ్ ముందు ఉంచాలని వైసీపీ భావిస్తుండవచ్చు. అందుకే మెగా డీఎస్సీని వదలకుండా పట్టుకుని బీజేపీ దృష్టిలో లోకేశ్ ను పలుచన చేస్తే ఆ ప్రభావం కూటమిపై పడుతుందని వైసీపీ అంచనా వేస్తున్నట్లు అనిపిస్తుంది.

**కేంద్ర సంస్థల జోక్యం కోసం డిమాండ్...**

రాష్ట్ర దర్యాప్తు సంస్థలపై నమ్మకం లేదని, కేవలం సీబీఐ విచారణ ద్వారానే నిజాలు బయటపడతాయని జగన్ పదే పదే ట్వీట్లు మరియు ప్రెస్ మీట్ల ద్వారా ఒత్తిడి పెంచుతున్నారు. దీని ద్వారా కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య, ముఖ్యంగా టీడీపీ–బీజేపీ బంధంలో ఒక రకమైన ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టించవచ్చనేది విపక్షాల అంతర్గత అంచనాగా కనిపిస్తోంది. గత వైసీపీ హయాంలో సరైన ఉద్యోగ నోటిఫికేషన్లు రాలేదనే అసంతృప్తి నిరుద్యోగుల్లో ఉందనే విమర్శలను కౌంటర్ చేయడానికి ఈ అంశం ఉపయోగపడుతుందని వైసీపీ భావిస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం సాధించిన అతిపెద్ద విజయాల్లో ఒకటైన మెగా డీఎస్సీపై 'అక్రమాల మరక' వేయడం ద్వారా మైలేజ్ పొందాలని ప్రతిపక్షం భావిస్తోంది. నిరుద్యోగ యువతలో కూటమి ప్రభుత్వంపై నమ్మకాన్ని సడలించేలా ప్రచారం చేయడం కూడా ఇందులో భాగమే. వైసీపీ చేస్తున్న ఆరోపణలను అధికార టీడీపీ తీవ్రంగా ఖండిస్తోంది. ఇదంతా కేవలం "దుష్ప్రచార వ్యూహం" అని కొట్టిపారేస్తోంది. మరి బీజేపీ దృష్టిలో టీడీపీని పలుచన చేయాలన్న వైసీపీ వ్యూహం ఎంత మేరకు పలుచన చేస్తుందన్నది చూడాలి.

### ఏపీ, కర్ణాటక పెద్దల ఆజ్ఞలను పాటిస్తూ ఇక్కడి నాణ్యమైన బొగ్గును ఆ రాష్ట్రాలకు తరలిస్తున్నారు

కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇచ్చిన హామీల అమలులో రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలమైందని, సాగు, తాగునీటితో పాటు విద్యుత్ రంగంలోనూ అరాచకం సృష్టిస్తోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఎప్పుడూ డైవర్షన్ డ్రామాలు ఆడుతూనే ఉంటున్నారని దుయ్యబట్టారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తిపై ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోందని, ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారని సంచలన ఆరోపణలు చేశారు. ఏపీ, కర్ణాటక ప్రభుత్వాల పెద్దల ఆజ్ఞలను పాటిస్తూ ఇక్కడి నాణ్యమైన బొగ్గును ఆ రాష్ట్రాలకు తరలిస్తున్నారని దుయ్యబట్టారు. ఇక యాదాద్రి పవర్ ప్లాంట్‌పై కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, సిమెంట్ పరిశ్రమలకు అవసరమైన యాష్ (బూడిద) అవసరాలను దృష్టిలో ఉంచుకునే దాన్ని దామరచర్లలో ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. ఎండిపోతున్న పొలాలు సీఎం రోజువారీ డ్రామాలతో పండవని, ఇప్పటికైనా అనవసరపు పనులు మాని పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని డిమాండ్ చేశారు. పాలిచ్చే ఆవులాంటి ట్రాన్స్‌కోను తన సన్నిహితులకు కట్టబెట్టేందుకు సీఎం రేవంత్ కుట్ర పన్నుతున్నారని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. దేశంలో ఢిల్లీ, ముంబై, ఒడిశా వంటి ప్రాంతాల్లో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించిన చోట ప్రజలపై విపరీతమైన భారం పడిందని అన్నారు. కేసీఆర్ మీద ఎంత ఒత్తిడి ఉన్నా నాటి ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేట్‌పరం చేయలేదని, కానీ ప్రస్తుత సర్కార్ మాత్రం కమీషన్లకు ఆశపడి ట్రాన్స్‌కో లక్షల కోట్ల ఆస్తులను కారుచౌకగా అమ్మేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ట్రాన్స్‌కో ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ప్రశ్నించిన అధికారులపై ఏసీబీ కేసుల పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అనుసరించే ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ తీవ్రంగా పోరాడుతుందని హెచ్చరించారు. నాటి సీఎం కేసీఆర్ చొరవతోనే తెలంగాణ చీకట్ల నుంచి వెలుగులోకి వచ్చిందని కొనియాడారు. అసాధ్యమనుకున్న 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను కొన్ని నెలల వ్యవధిలోనే అన్ని వర్గాలకు అందించిన ఘనత బీఆర్ఎస్‌దేనని స్పష్టం చేశారు. కేవలం ట్రాన్స్‌కోపైనే రూ.36 వేల కోట్లు వెచ్చించి, ఎక్కడ విద్యుత్ సరఫరా నిలిచినా మరో మార్గం ద్వారా అనుసంధానించే అధునాతన గ్రిడ్ వ్యవస్థను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని గుర్తుచేశారు.

### కర్నూలులో ఏవియేషన్ అకాడమీ రావడం చరిత్రాత్మకం

రాష్ట్రంలోనే ప్రప్రథమంగా కర్నూలు ఎయిర్‌పోర్టులో ఏవియేషన్ ట్రైనింగ్ సెంటర్ అందుబాటులోకి రావడం చరిత్రాత్మకమని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కర్నూలు విమానాశ్రయం వేదికగా ఈరోజు 'ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ' ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ సిరి, స్థానిక ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, కేఈ శ్యామ్ బాబుతో పాటు అకాడమీ చైర్మన్ ఆనంద్ జాకబ్ వర్గీస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భవిష్యత్ ప్రణాళికలపై మాట్లాడిన మంత్రి జనార్దన్ రెడ్డి... ఓర్వకల్లులో అత్యాధునిక హంగులతో 'డ్రోన్ సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. దీన్ని రెండు దశలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. తొలి విడతలో 180 ఎకరాల్లో, ఆ తర్వాత రెండో దశలో మరో 400 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. గతంలో 2017లో కర్నూలు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి పునాదిరాయి వేసి, అతి తక్కువ కాలంలోనే దానిని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేశామని జనార్దన్ రెడ్డి గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో ఏవియేషన్ సెక్టార్‌లో ప్రొఫెషనల్స్, పైలట్లకు డిమాండ్ విపరీతంగా పెరగనుందని తెలిపారు. ఈ కొత్త ట్రైనింగ్ సెంటర్ ద్వారా కర్నూలు జిల్లా యువతతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు విమానయాన రంగంలో నిపుణులుగా శిక్షణ పొందే సువర్ణావకాశం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఈసీ ప్రకటనతో అపోహలకు తెరపడింది

- మొదటి పేజీ తరువాయి

తాజాగా ఈసీ వివరణతో ముగిసిందని తెలిపారు. స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం దురదృష్టకరమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాలు ప్రజల తీర్పును ప్రతిబింబిస్తాయని, బలమైన ప్రజాస్వామ్యంలో గెలుపును, ఓటమిని సమానంగా, హుందాగా స్వీకరించడమే నిజమైన నాయకత్వ లక్షణమని హితవు పలికారు. రాజ్యాంగ సంస్థలను గౌరవించడం అత్యంత ముఖ్యమని, భారత ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం పార్టీలకు అతీతంగా నాయకులందరి ఉమ్మడి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు.

**సంయుక్త ప్రకటనతో వివాదానికి ముగింపు**

కాగా, గత కొద్ది రోజులుగా తమ మధ్య తీవ్ర విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న ఊహాగానాలకు భారత ఎన్నికల సంఘం పూర్తిస్థాయి కమిషన్ శనివారం తెరదించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న ఫోటోతో పాటు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా సవరణ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

**వివాదానికి నేపథ్యం ఇదే..**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ సెప్టెంబర్ 23న ఓ ప్రముఖ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించి, తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేసింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో పేర్కొంది. ఆ తర్వాత కార్యక్రమ షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది. నిర్ణయాలన్నీ సమష్టిగా, సంస్థాగత విధివిధానాలను అనుసరించే తీసుకుంటామని కమిషన్ స్పష్టం చేసింది.

# కాంగ్రెస్‌తో కలవాలనే ఉద్దేశంతోనే జగన్ వైఖరి మార్చుకుంటున్నారా?

వైసీపీ అధినేత జగన్ పై టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్‌ది అవకాశవాద, ద్వంద్వ వైఖరి అని ఆరోపిస్తూ సోషల్ మీడియా వేదికగా పలు కీలక ప్రశ్నలు సంధించారు. ఆయన రాజకీయ సౌలభ్యం కోసం వైఖరులు మార్చుకుంటున్నారని ఘాటుగా విమర్శించారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఇప్పుడు ఆరోపణలు చేస్తున్న జగన్, గతంలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇదే ప్రక్రియను ప్రామాణికంగా తీసుకున్నారని లావు గుర్తుచేశారు. "ఎస్ఐఆర్ పూర్తయ్యాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మీ పార్టీ ఎమ్మెల్సీ లెల్ల అప్పిరెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం వాస్తవం కాదా? కోర్టులో ఒకలా, ఇప్పుడు మరోలా మాట్లాడటంలోని ఆంతర్యమేమిటి?" అని ఆయన ప్రశ్నించారు. అదేవిధంగా, ఎన్నికల కమిషనర్ల నియామక ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (సీజేఐ) తొలగిస్తూ 2023లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టానికి వైసీపీ మద్దతు ఇచ్చిందని లావు పేర్కొన్నారు. కానీ ఇప్పుడు, ప్రధాని, ప్రతిపక్ష నేతతో పాటు సీజేఐ కూడా ప్యానెల్‌లో ఉండాలని జగన్ డిమాండ్ చేయడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఈ ఆకస్మిక మార్పుల వెనుక రాజకీయ వ్యూహం ఉందని లావు అనుమానం వ్యక్తం చేశారు. 2029 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, తన మాతృ సంస్థ అయిన కాంగ్రెస్‌తో రాజకీయంగా కలవాలనే ఉద్దేశంతోనే జగన్ ఇలా తన వైఖరిని మార్చుకుంటున్నారా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు.

# పరవాడ ఫార్మా కాలుష్యంపై పవన్ కల్యాణ్ సీరియస్.. 95 కంపెనీలకు నోటీసులు

సోషల్ మీడియాలో వచ్చిన ఒక ఫిర్యాదుపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణమే స్పందించారు. ఆయన ఆదేశాలతో అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని 95 పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. శుద్ధి చేయని వ్యర్థాలను వర్షపు నీటి కాలువల్లోకి విడుదల చేస్తూ కాలుష్యానికి కారణమవుతున్నారన్న ఆరోపణలపై ఈ చర్యలు తీసుకుంది. వివరాల్లోకి వెళితే, పరవాడ ఫార్మాసిటీ సమీపంలోని డ్రెయిన్లలో నల్లటి రంగులో, దుర్వాసనతో కూడిన నీరు ప్రవహిస్తున్నట్లు శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో పోస్ట్ అయింది. ఈ వీడియో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి వెళ్లడంతో, వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన పీసీబీ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన పీసీబీ అధికారులు, వీడియోలో కనిపించిన ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. నమూనాలను సేకరించి పరిశీలించగా, శుద్ధి చేయని వ్యర్థ జలాలు వర్షపు నీటి కాలువల్లోకి చేరుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీనికి బాధ్యులుగా ఫార్మాసిటీలోని మొత్తం 95 కంపెనీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

కేవలం నోటీసులు ఇవ్వడమే కాకుండా, కాలుష్య నివారణకు పలు కఠినమైన దిద్దుబాటు చర్యలను కూడా పీసీబీ తప్పనిసరి చేసింది. పరిశ్రమల ప్రాంగణంలోనే వర్షపు నీటిని నిల్వ చేయాలని, కలుషిత నీటిని బయటకు వదలరాదని స్పష్టం చేసింది. వ్యర్థాల నిర్వహణను డిజిటలైజ్ చేయాలని, తేదీ, సమయంతో సహా రికార్డ్ చేసే సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి ఫుటేజీని ఆరు నెలల పాటు భద్రపరచాలని సూచించింది. ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థతో కూడిన స్క్రబ్బర్లను వాడాలని, పర్యావరణ అనుమతుల నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశాల్లో పేర్కొంది. నిర్ణీత సమయంలో సంతృప్తికరమైన సమాధానం ఇవ్వని, అక్రమంగా వ్యర్థాలను విడుదల చేస్తున్నట్లు తేలిన పరిశ్రమలపై పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పీసీబీ హెచ్చరించింది. తీసుకున్న చర్యలపై ఒక సమగ్ర నివేదికను ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపినట్లు అధికారులు తెలిపారు.

# ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం..

- మొదటి పేజీ తరువాయి

జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి శనివారం న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న గ్రూప్ ఫోటోతో పాటు ఒక సుదీర్ఘమైన ప్రెస్ నోట్‌ను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ూ×=), ఓటర్ల నమోదు ప్రక్రియ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలపై ఇందులో సమగ్రంగా వివరణ ఇచ్చారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారని సెప్టెంబర్ 23న ఓ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. ఆ తర్వాత ఈ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ప్రత్యేక సవరణ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది. కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం-6లో, దరఖాస్తుదారులు తమ తల్లిదండ్రుల పేర్ల ద్వారా గత సవరణతో తమ సంబంధాన్ని ధ్రువీకరించాలనే నిబంధనపై వస్తున్న విమర్శలపైనా కమిషన్ స్పందించింది. ఈ డిక్లరేషన్‌ను కూడా సుప్రీంకోర్టు సమర్థించిందని తెలిపింది. అయితే, ఈ నిబంధన కేవలం ప్రత్యేక సవరణ ప్రక్రియకు మాత్రమే వర్తిస్తుందని, మిగతా సమయాల్లో ఎలక్టర్ల నమోదు నిబంధనలు, 1960 ప్రకారం నిర్దేశించిన ఫారాలనే వాడతామని స్పష్టం చేసింది. గోవాలో 97 మంది ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోవడంపై కూడా ఈసీ వివరణ ఇచ్చింది. ఇంటింటి సర్వే నిర్వహించి, అవసరమైన ఫారాలను సేకరించాలని గోవా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ) సంబంధిత బూత్ లెవల్ అధికారులను ఆదేశించారని పేర్కొంది. ఇప్పటికే ఆ 97 మందిలో 81 మంది తమ పేర్లను చేర్చాలని కోరుతూ ఫారం-6 సమర్పించారని వెల్లడించింది.

ఇక, ఎలక్టోరల్ రోల్ డేటాబేస్‌కు యాక్సెస్ విషయంలో ఈసీఐనెట్ (ుజ×చీు) పోర్టల్‌పై తలెత్తిన ఆందోళనలపైనా కమిషన్ స్పందించింది. క్షేత్రస్థాయి అధికారులకు వారి చట్టబద్ధమైన అధికారాలకు అనుగుణంగానే 'రోల్-బేస్డ్ యాక్సెస్' ఇస్తామని స్పష్టం చేసింది. ఈ పోర్టల్ పనితీరును సమీక్షించేందుకు ఓ సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందులో ఐఐటీ లేదా ట్రిపుల్ ఐటీకి చెందిన స్వతంత్ర నిపుణుడు కూడా ఉంటారని ప్రకటించింది. క్యాబినెట్ సెక్రటరీకి పంపిన లేఖ ఈసీ విధానపరమైన అంశాలకు సంబంధించింది కాదని, డిప్యుటేషన్‌పై ఉన్న ఓ అధికారి పని పునఃపంపిణీకి మాత్రమే సంబంధించిందని కమిషన్ స్పష్టం చేసింది.

అంతర్గత పనివిధానాలను మరింత బలోపేతం చేసేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు ఈసీ ప్రకటించింది. ఇకపై కమిషన్ సమావేశాల అజెండాలను సభ్యులకు ముందుగానే సర్క్యులేట్ చేయాలని, సమావేశం అనంతరం మినిట్స్ జారీ చేయాలని నిర్ణయించింది. కమిషనర్లు అధికారులకు జారీ చేసే ఆదేశాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. ఢిల్లీ, మహారాష్ట్రల్లో ప్రత్యేక సవరణ గడువును పొడిగిస్తున్నట్లు తెలిపింది. తమ ప్రధాన నిర్ణయాలన్నీ సమష్టిగా, ఏకగ్రీవంగానే తీసుకున్నామని కమిషన్ పునరుద్ఘాటించింది.

# సీఎం విజయ్ నటనను ఇంకా ఆపలేదు: స్టాలిన్

తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్‌పై మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సినిమాలకు స్వస్తి పలికినప్పటికీ, ప్రజల ముందు విజయ్ ఇంకా నటిస్తూనే ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఈ మేరకు శనివారం 'ఎక్స్' వేదికగా ఆయన ఒక పోస్ట్ చేశారు.

మధురాంతకం అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచారంలో విజయ్ నటనను తాను ప్రత్యక్షంగా చూశానని స్టాలిన్ పేర్కొన్నారు. డీఎంకేను ఒక దుష్టశక్తిగా, టీవీకేను పవిత్ర శక్తిగా విజయ్ అభివర్ణించడం హాస్యాస్పదమని విమర్శించారు. విజయ్ ప్రభుత్వ హయాంలో పరిపాలన పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో విద్యుత్ కోతలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, పాల కొరత, శాంతిభద్రతల క్షీణత వంటి సమస్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. గత డీఎంకే ప్రభుత్వ పథకాలకే పేర్లు మార్చి టీవీకే ప్రభుత్వం అమలు చేస్తోందని ఆయన మండిపడ్డారు. జెమ్ గ్రానైట్స్ ఛైర్మన్ ఆర్. వీరమణికి సంబంధించిన పోక్సో కేసులో డీఎంకేపై విజయ్ చేస్తున్న ఆరోపణలు కేవలం నిరాధారమని స్టాలిన్ కొట్టిపారేశారు. ఈ విషయంపై తాను ఇప్పటికే అసెంబ్లీలో స్పష్టమైన వివరణ ఇచ్చానని గుర్తుచేశారు. దర్యాప్తు దశలో ఉన్న అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవద్దని మద్రాస్ హైకోర్టు ఆదేశించినప్పటికీ, ఎన్నికల ప్రచారంలో విజయ్ పదేపదే ఈ అంశాన్ని ప్రస్తావించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రజల ముందు నటించడం మాని, ముఖ్యమంత్రి పదవికి ఉండాల్సిన రాజకీయ హుందాతనాన్ని ప్రదర్శించాలని విజయ్‌కు స్టాలిన్ హితవు పలికారు.

### భారీ వర్షాలతో ఉత్తరాంధ్ర అతలాకుతలం..

**నిండిన జలాశయాలు.. తగ్గిన వర్షపాతం లోటు**

తాజా వర్షాల వల్ల రాష్ట్రంలోని 29 ప్రధాన రిజర్వాయర్లలోకి భారీగా నీరు వచ్చి చేరినట్లు ఇరిగేషన్ అధికారులు సీఎంకు వివరించారు. సెప్టెంబర్ 23 నాటికి 101 టీఎంసీలుగా ఉన్న నీటి నిల్వ, కేవలం మూడు రోజుల్లో 21 టీఎంసీలు పెరిగి 122 టీఎంసీలకు చేరిందని తెలిపారు. ఒక్క ఉత్తరాంధ్రలోని 11 ప్రాజెక్టుల్లోనే సుమారు 5 టీఎంసీల నీరు అదనంగా చేరిందని వివరించారు. ఈ వర్షాల వల్ల రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గిందని అధికారులు తెలిపారు.

గోదావరిపై ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రవాహం 1.20 లక్షల క్యూసెక్కుల నుంచి 3.50 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. వంశధారపై గొట్టా బ్యారేజీకి, నాగావళిపై నారాయణపురం ఆనకట్టకు కూడా ఇన్‌ఫ్లో రికార్డు స్థాయిలో పెరిగింది. పెరిగిన ప్రవాహాలను సద్వినియోగం చేసుకుని రిజర్వాయర్లతో పాటు చిన్న, మధ్య తరహా నీటి వనరులను కూడా నింపాలని సీఎం ఆదేశించారు. వరద తగ్గుముఖం పట్టినా, ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### 10 శాతం వృద్ధి సాధ్యమే

దేశ ఆర్థిక వృద్ధి రేటు 10 శాతం మార్కును అధిగమించాలంటే అన్ని రంగాల్లోనూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ వంటి భవిష్యత్ సాంకేతిక విభాగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టడం ద్వారానే దేశం అభివృద్ధి పథంలో దూసుకెళుతుందని ఆమె స్పష్టం చేశారు. బెంగళూరులో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. సాంకేతికత ఆధారంగా వివిధ రంగాల్లో మరిన్ని అంకుర సంస్థలు ఆవిర్భవించాలని ఆమె పిలుపునిచ్చారు. నూతన సాంకేతికతలను ప్రజలు సులభంగా అందిపుచ్చుకునేలా నైపుణ్యాభివృద్ధి, శిక్షణా కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేవలం దిగ్గజ సంస్థలకే పరిమితం కాకుండా, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో (ఎంఎస్ఎంఈ) సైతం ఏఐ వినియోగం గణనీయంగా పెరగాలని ఆమె ఆకాంక్షించారు. దేశ మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థికాభివృద్ధిలో తదుపరి దశకు చేరుకోవాలంటే అన్ని విభాగాల్లోనూ డిజిటల్ వ్యవస్థలకు పెద్దపీట వేయాలని నిర్మలా సీతారామన్ వివరించారు. ఈ ఆధునిక సాంకేతిక రంగాలకు తగిన ప్రోత్సాహం అందిస్తే, దేశ భవిష్యత్తును మరింత ఉజ్వలంగా తీర్చిదిద్దవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు.

### సీఈసీ రాజీనామా చేయాల్సిందే

భారత ఎన్నికల సంఘం ) తీరుపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఆయనపై విచారణ జరపాలని డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితా సవరణ పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్ల పేర్లను తొలగించే భారీ కుట్ర జరుగుతోందని ఆరోపించింది. ఈ సవరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ శనివారం గట్టిగా పట్టుబట్టింది. ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు ఉన్నాయంటూ మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో, ఈసీఐ నేడు ఓ ప్రెస్ నోట్ విడుదల చేసింది. ఈ వివరణ కాంగ్రెస్ ఆగ్రహాన్ని మరింత పెంచింది. ఈసీఐ ఇప్పుడు ఆత్మరక్షణలో పడిందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ జైరాం రమేశ్ విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా వరుస పోస్టులతో ఈసీఐని, సీఈసీని లక్ష్యంగా చేసుకుని పలు ప్రశ్నలు సంధించారు. "మీడియా కథనాల్లో వచ్చిన ఆరోపణలను ఈసీఐ తన ప్రెస్ నోట్‌లో ఎక్కడా నేరుగా ఖండించలేదు. వాటి తీవ్రతను తగ్గించే ప్రయత్నం మాత్రమే చేసింది. గోవా విషయంలో తప్పు చేసి దొరికిపోయాక, తొలగించిన 97 మందిలో 81 మంది పేర్లను తిరిగి చేర్చామని సిగ్గులేకుండా చెబుతోంది. అంటే, మొదట ఓటర్ల హక్కును కాలరాసి, దొరికిపోయాక మళ్లీ వారి పేర్లను చేర్చుతున్నామని చెప్పడం ఎంతవరకు సమంజసం?" అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. ఢిల్లీ, మహారాష్ట్రల్లో ఓటరు నమోదు గడువును పొడిగించిన ఈసీఐ.. కర్ణాటక, తెలంగాణ, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అన్యాయంగా ఓటు హక్కు కోల్పోయిన వారి పరిస్థితి ఏంటని నిలదీశారు. కేవలం ఒక వ్యక్తి అవినీతి వల్ల ఓటు హక్కు కోల్పోయిన ఈ రాష్ట్రాల ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఈసీఐకి లేదా అని ఆయన అన్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ఐఐటీ/ట్రిపుల్ ఐటీ నిపుణులతో ఈసీనెట్ పోర్టల్‌ను సమీక్షిస్తామని చెప్పడం, సమస్య ఉందని అంగీకరించడమేనని జైరాం రమేశ్ పేర్కొన్నారు. సీఈసీ ఏకపక్ష నిర్ణయాలు, ప్రతిపక్షాలపై ద్వేషం, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం, ముఖ్యంగా యువ ఓటర్లను (జెన్ ్ ) లక్ష్యంగా చేసుకోవడం వంటి అంశాలు ఆయన అవినీతిని బయటపెట్టాయని ఆరోపించారు. ఫారం 6లో పార్లమెంటు ఆమోదం లేకుండా మార్పులు చేసి, యువత ఓటు నమోదు చేసుకోకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. సీఈసీ బ్యూరోక్రసీ ముసుగులో దాక్కోవాలని చూస్తున్నారని, కానీ ఆయన బండారం బట్టబయలైందని జైరాం రమేశ్ అన్నారు. దేశమంతా ఆయనను జవాబుదారీ చేయాలని చూస్తోందని, ఈ నేపథ్యంలో సీఈసీ రాజీనామా లేదా ఆయనపై విచారణ జరపడం మినహా మరో మార్గం లేదని స్పష్టం చేశారు.

### పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి.. 11 మంది మృతి

పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు మరోసారి మారణహోమం సృష్టించారు. వాయవ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో శనివారం చోటుచేసుకున్న ఆత్మాహుతి దాడిలో కనీసం 11 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. డేరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లాలోని ఒక రహదారి పక్కన ఉన్న పోలీసు చెక్‌పోస్ట్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగింది. పేలుడు పదార్థాలతో నింపిన వాహనంతో వచ్చిన ఆత్మాహుతి బాంబర్, చెక్‌పోస్ట్ సమీపంలోకి రాగానే తనను తాను పేల్చుకున్నాడు. ఈ పేలుడు ధాటికి ఆ ప్రాంతం ఒక్కసారిగా దద్దరిల్లింది. ఈ ఘటనలో భారీ స్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఈ ఘాతుకానికి తమదే బాధ్యతని పాకిస్థానీ తాలిబన్‌గా పిలిచే తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ప్రకటించింది. ఇటీవలి కాలంలో పాకిస్థాన్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు గణనీయంగా పెరిగాయి. ప్రధానంగా టీటీపీ, బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) వంటి వేర్పాటువాద సంస్థలు వరుస దాడులకు పాల్పడుతున్నాయి. ఈ తాజా ఘటనతో దేశంలోని భద్రతా వ్యవస్థలోని లోపాలపై మరోసారి తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను కలసిన ప్రత్తిపాడు మండల ప్రత్యేక అధికారి.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్,సెప్టెంబర్, 26:**ప్రత్తిపాడు మండలం పెద శంకర్లపూడిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభరాజాను ప్రత్తిపాడు మండల ప్రత్యేకాధికారిగా నియమితులైన జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ వివివి సత్యనారాయణ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు పుష్పగుచ్చం అందించి ప్రత్తిపాడు మండలం ప్రత్యేక అధికారిగా నియమితులైనట్లు తెలియజేశారు.



పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా




## ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభకు ప్రత్తిపాడు గ్రామ రెవెన్యూ సహాయకులు వినతి.



-11వ రోజు చేరుకున్న వీఆర్ఏల నిరవధిక దీక్ష.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, సెప్టెంబర్,26:**తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ప్రత్తిపాడు మండలం వీఆర్ఏలు ఏపీ వీఆర్ఏ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు చేపెట్టిన నిరవధిక సమ్మె శనివారం 11వ రోజుకు చేరుకుంది. 11 రోజులుగా నిరవధిక దీక్ష చేపట్టినప్పటికీ ప్రభుత్వం కనీసం స్పందించకపోవడంతో శనివారం పెదశంకర్లపూడి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజాకు వీఆర్ఏలు వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ తమ న్యాయమైన కోరికలను అమలు చేసేందుకు తమ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, పెరిగిన నిత్యవసర వస్తువులు ధరలకు అనుగుణంగా పే స్కేల్ అమలు చేసేలాగా చూడాలని వీఆర్ఏలు ఎమ్మెల్యే సత్యప్రభ కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు వీఆర్ఏలు పాల్గొన్నారు.

## ఇంటి దొంగతనాన్ని ఛేదించిన పెద్దాపురం పోలీసులు



- నిందితుడు అరెస్ట్.. రూ.30 లక్షల విలువైన చోరీ సొత్తులో భారీగా రికవరీ
- రూ.15 లక్షల నగదు, 105.4 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం



**కాకినాడ/పెద్దాపురం, సెప్టెంబర్ 26 పెన్ పవర్:** పెద్దాపురం రామారావుపేటలోని ఆర్డీవో నివాసంలో జరిగిన భారీ ఇంటి దొంగతనం కేసును పెద్దాపురం పోలీసులు ఛేదించారు. కేసులో నిందితుడిగా గుర్తించిన అడ్డతీగల మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన మామిడి శివకుమార్ అలియాస్ శివ (30)ను పోలీసులు అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి రూ.15 లక్షల నగదు, 105.4 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. చోరీకి గురైన సొత్తులో మరో రూ.2 లక్షల విలువైన ఆస్తిని రికవరీ చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

### ఆర్డీవో నివాసంలో చోరీ

పోలీసుల వివరాల ప్రకారం.. జూలై 25 అర్ధరాత్రి సమయంలో పెద్దాపురం రామారావుపేటలోని డీఎల్‌పీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న ఆర్డీవో నివాసంలో గుర్తుతెలియని వ్యక్తి వెనుక వైపు తలుపుకు మెష్ డోర్ మాత్రమే వేసి ఉండటాన్ని గమనించాడు. తలుపు గడియను తెరిచి ఇంట్లోకి ప్రవేశించిన నిందితుడు.. ఎవరూ లేని రెండో గదిలోని కప్‌బోర్డులో ఉన్న తాళాన్ని తీసుకుని ఇనుప అల్మారాను తెరిచాడు. అందులోని బంగారం భద్రపరిచే లాకర్ నుంచి సుమారు 276 గ్రాముల బంగారం, 48 గ్రాముల వెండి, రూ.75 వేల నగదును అపహరించాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందడంతో పెద్దాపురం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 194/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్లు 331(4), 305(ఏ) ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### సాంకేతిక పరిజ్ఞానంతో కేసు ఛేదింపు

కేసులో ప్రత్యక్ష ఆధారాలు లభించని పరిస్థితుల్లోనూ కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపీఎస్ అందించిన సాంకేతిక సహకారం, ఆధునిక దర్యాప్తు పద్ధతులను పోలీసులు వినియోగించారు. పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టి నిందితుడిని గుర్తించారు. ఈ క్రమంలో శనివారం వడ్లమూరు గ్రామ శివారులోని శ్రీ సాయి ఎంటర్‌ప్రైజెస్ హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద నిందితుడు మామిడి శివకుమార్ అలియాస్ శివను పెద్దాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి చోరీకి గురైన నగదు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

### 105.4 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

రికవరీ చేసిన బంగారు ఆభరణాల్లో తెల్లటి రాళ్లతో కూడిన రెండు బంగారు గాజులు 41 గ్రాములు, తెల్లటి రాళ్లతో కూడిన బంగారు నెక్లెస్ 20 గ్రాములు, బంగారు చెవిలీలు ఒక జత 6.4 గ్రాములు, వినాయక ముఖం లాకెట్‌తో కూడిన బంగారు చైన్ 18 గ్రాములు, నల్లటి వెంకన్నబాబు ముఖం స్టోన్‌తో కూడిన బంగారు ఉంగరం 12 గ్రాములు, కమలం ప్రతిమ కలిగిన బంగారు ఉంగరం 8 గ్రాములు ఉన్నాయి. వీటితో పాటు రూ.15 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

### దర్యాప్తు బృందానికి ఎస్పీ అభినందనలు

జిల్లా ఎస్పీ బిందు మాధవ్ పర్యవేక్షణలో అదనపు ఎస్పీ డా. మహంతి కిషోర్ కుమార్, పెద్దాపురం ఎస్‌డీపీఓ ఏబీజీ తిలక్ ఆధ్వర్యంలో దర్యాప్తు సాగింది. పెద్దాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, పెద్దాపురం సీసీఎస్ సీఐ అంకబాబు, ఐటీ కోర్ సీఐ దుర్గా శేఖర్ రెడ్డి, ఎస్ఐ యు. పాపారావు, పెద్దాపురం పోలీస్ స్టేషన్ సిబ్బంది వి. శేషారావు, సీసీఎస్ సిబ్బంది బలరామూర్తి, శ్రీహరి, మూర్తి, నాగరాజు, రమణ, ఎస్. బాలాజీ, ఏ. మురళి తదితరులు దర్యాప్తులో పాల్గొన్నారు. కేసును చాకచక్యంగా ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేయడంతో పాటు చోరీ సొత్తును రికవరీ చేసిన పెద్దాపురం ఎస్‌డీపీఓ ఏబీజీ తిలక్, సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, సీసీఎస్ సీఐ అంకబాబు, ఐటీ కోర్ సీఐ దుర్గా శేఖర్ రెడ్డి, ఎస్ఐ యు. పాపారావు, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అభినందించారు.

## పిఠాపురం నియోజకవర్గంలో కనీస వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి





- తాగునీరు, రహదారులు, వీధిలైట్లు, పారిశుధ్యంపై శాశ్వత పరిష్కారాలు చూపాలి
- 52 గ్రామ పంచాయతీల్లో క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**కాకినాడ/పిఠాపురం,సెప్టెంబర్ 26 పెన్ పవర్:**పిఠాపురం నియోజకవర్గంలో తాగునీరు, రహదారులు, వీధిలైట్లు, పారిశుధ్యం వంటి కనీస మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధి పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా పనుల పురోగతిని సమీక్షించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఉన్నారని తెలిపారు. ఆ లక్ష్యానికి అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు అధికారులు అంకితభావంతో పనిచేయాలని స్పష్టం చేశారు. పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ బృంద సభ్యులు వారానికి ఐదు రోజులపాటు నియోజకవర్గంలోని 52 గ్రామ పంచాయతీల్లో క్షేత్రస్థాయిలో పర్యటించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణ పరిష్కారాలు చూపాలన్నారు.

కనీస మౌలిక వసతుల కల్పనలో 100 శాతం ప్రజా సంతృప్తి సాధించేలా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతి గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, పారిశుధ్య నిర్వహణలో శాశ్వత మార్పు కనిపించేలా క్షేత్రస్థాయి పర్యవేక్షణను పెంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గ పరిధిలోని సుమారు 18 దేవాలయాల్లో మౌలిక వసతుల కల్పన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పాదగయ ప్రాంత సుందరీకరణ, స్కిల్ హబ్ రహదారులు, సీసీ డ్రైన్లు, మున్సిపల్ పార్కుల అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. అలాగే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, గొల్లప్రోలు సెంట్రల్ లైటింగ్ పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని, ఎఫ్ఎస్‌టీపీ (మలిన జలాల శుద్ధి కేంద్రం) నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం, 14 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్ఏఎస్‌సీఐ గ్రాంట్, 15వ ఆర్థిక సంఘం, పబ్లిక్ హెల్త్, ఆర్ఐడీఎఫ్, ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల్లో పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత కాలపరిమితిలోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడంలో ఎలాంటి జాప్యం ఉండకూడదన్నారు. ప్రతి అభివృద్ధి పనికి స్పష్టమైన లక్ష్యం, గడువు నిర్దేశించుకుని, వివిధ శాఖల మధ్య సమన్వయంతో పిఠాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సమిష్టిగా కృషి చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డా. డి. తిప్పే నాయక్, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ రత్నరాజు, డీఎస్‌డీఓ సతీష్ కుమార్, పిఠాపురం మున్సిపల్ అధికారులు, పబ్లిక్ హెల్త్, దేవాదాయ ధర్మాదాయ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాజులూరు మండలంలో ప్రత్యేక అధికారి సమీక్ష



ఎన్నికల నిర్వహణతో పాటు తుఫాన్ ప్రభావిత గ్రామాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

**కాజులూరు, సెప్టెంబర్ 26 పెన్ పవర్:** కాజులూరు మండల ప్రత్యేక అధికారిగా నియమితులైన డ్వామా పీడీ ఎస్. మధుసూదన్ ఈ నెల 24న బాధ్యతలు స్వీకరించిన అనంతరం శనివారం కాజులూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యాలయానికి చేరుకున్న ప్రత్యేక అధికారికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి జె. రాంబాబు, కార్యాలయ సిబ్బంది ఘనస్వాగతం పలికారు. అనంతరం మండల పరిధిలోని అన్ని గ్రామాల పరిస్థితులు, పోలింగ్ బూత్‌ల వివరాలను ప్రత్యేక అధికారి అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు ముందుగానే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆయా గ్రామాల్లో వైద్య సహాయం, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు



అవసరమైన సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జె. రాంబాబు, పరిపాలనాధికారి పద్మలత, డిప్యూటీ ఎంపీడీవో ఎం. సత్యనారాయణమూర్తి, కార్యాలయ సిబ్బంది, వీవీబీజీ రాంజీ, కార్యాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సామర్థ్యాల పెంపుపై దృష్టి పెట్టాలి-డీఈఓ పి. రమేష్






**గండేపల్లి,పెన్ పవర్, సెప్టెంబర్ ,26** స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో భాగంగా గండేపల్లి మండలం నాయకంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సమావేశాలను జిల్లా విద్యాశాఖ అధికారి పి. రమేష్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థుల విద్యా సామర్థ్యాలపై ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు.ప్రతి విద్యార్థి తరగతి స్థాయికి అనుగుణంగా నిర్దేశించిన సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఈఓ సూచించారు. రాబోయే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యతో పాటు విద్యా ప్రమాణాలను మరింత పెంచేందుకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు కేహెచ్ నాయక్, కే. వెంకటరెడ్డి, నాయకంపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. చినరాజు, కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆధునిక కమ్యూనికేషన్ టెక్నాలజీపై అవగాహన

- ఆదిత్య యూనివర్సిటీలో అతిథి ఉపన్యాసం




**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** ఆదిత్య యూనివర్సిటీ ఇ.సి.ఇ. విభాగం ఆధ్వర్యంలో బీటెక్ మూడో సంవత్సరం విద్యార్థులకు ఆధునిక కమ్యూనికేషన్ టెక్నాలజీపై ప్రత్యేక అతిథి ఉపన్యాసం నిర్వహించారు. 'స్మార్ట్ అండ్ సస్టెయినబుల్ సిటీస్ కోసం అభివృద్ధి చెందుతున్న కమ్యూనికేషన్ టెక్నాలజీ--పరిశ్రమ అనువర్తనాలు, కెరీర్ అవకాశాలు, భవిష్యత్ ధోరణులు' అనే అంశంపై ఈ కార్యక్రమం జరిగింది.
ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్ ఇ.సి.ఇ. విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. కిరణ్ కుమార్ గుర్రాల ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ఆధునిక కమ్యూనికేషన్ సాంకేతికతపై అవగాహన కల్పించారు. స్మార్ట్ సిటీల్లో కమ్యూనికేషన్ టెక్నాలజీ వినియోగం, పరిశ్రమల అవసరాలు, భవిష్యత్ కెరీర్ అవకాశాలను వివరించారు. ముఖ్యంగా 5జీ, 6జీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), వైర్‌లెస్ కమ్యూనికేషన్, స్మార్ట్ సిటీ సాంకేతికతల ప్రాధాన్యాన్ని వివరించారు.పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక, ప్రాక్టికల్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.
స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ డా. జి. శ్రీదేవి మాట్లాడుతూ, నిపుణుల అతిథి ఉపన్యాసాలు విద్యార్థులకు నూతన సాంకేతికతలపై అవగాహన కల్పించడంతో పాటు భవిష్యత్ కెరీర్‌కు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఇ.సి.ఇ. విభాగాధిపతి డా. సి.హెచ్. జానకి దేవి పరిశ్రమ ఆధారిత అభ్యాసం ప్రాధాన్యాన్ని వివరించారు.
కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. మహేష్ కుమార్ సింగ్, డిప్యూటీ హెచ్ఓడీ డా. సి.హెచ్. రవి శంకర్, డా. కె.హెచ్.కె. ప్రసాద్, ఇ.సి.ఇ. విభాగం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

## దివ్యాంగులకు సంక్షేమ పథకాలపై అవగాహన




**ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**పారసంస్థ సిబిఆర్ కోఆర్డినేటర్ బడుగు మహిమారావు ఆధ్వర్యంలో ఆలమూరు పంచాయతీ కార్యాలయం నందు దివ్యాంగుల చట్టం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా రిసోర్స్ పర్సన్ గా హాజరైన ల్యాంప్ సంస్థ అడ్వకేసి కోఆర్డినేటర్ బడుగు సుబ్బాయమ్మ దివ్యాంగులకు చట్టం, ప్రభుత్వ పథకాల, 2016 చట్టం ప్రకారం 21 యొక్క రకాల దివ్యాంగులకు ట్రైన్, బస్సు పాసులు, ఏ కేటగిరి దివ్యాంగుల పరిధిలోకి వస్తారనేది, రూ.15,000 పింఛన్ ఎవరు అర్హులు స్కూటీలు ఎవరికి ఇస్తారు దాని యొక్క అర్హతలు, ఎవరూ ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా మీ హక్కులని మీరు కాపాడుకోవాలని ఆమె తెలిపారు. సదరం స్లాట్ బుకింగ్ ముందు ఆధార్ కార్డుకు ఫోన్ నెంబర్ లింక్ చేసుకోవాలని, సదరం రీ అసెస్మెంట్ కి వెళ్లిన అమలాపురం వెళ్లిన ఇంతవరకు సర్టిఫికెట్స్ రాలేదని ఆ విషయాన్ని మేము కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్ళామన్నారు. చట్ట ప్రకారం 40 శాతం అంగవైకల్యం ఉంటే అర్హులని, ఎవరికైనా ఉపకార పరికరాలు అవసరమైతే ఆన్లైన్లో పెట్టుకుంటే ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందని అనే విషయాలు పై అవగాహన కల్పించారు. ఇంకా వికలాంగ పింఛనుకు అర్హులైన చాలామంది ఉన్నారని, మంచానికి పరిమితమైన, దివ్యాంగుల వివాహ ప్రోత్సాహ బహుమతి అసెస్మెంట్ అని పెట్టి అంగవైకల్య శాతాన్ని తగ్గించటం, బహుళ వికలాంగత్వం, సదరం సర్టిఫికెట్స్ లో పేర్లు తప్పులు, పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. అనంతరం దివ్యాంగులతో గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 58 మంది దివ్యాంగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాల దెబ్బకు నేలవాలిన రైతన్న ఆశలు

- చేతికొచ్చే వేళ మిరప పంటకు నీటి ముప్పు
- మినుము, పెసర పంటలపైనా భారీ వర్షాల ప్రభావం
- ఈదురుగాలులకు దెబ్బతిన్న అరటి తోటలు
- ఎర్రంపాలెంలో 200 ఎకరాలకు పైగా మిరప సాగు
- గతేడాది నకిలీ విత్తనాలు.. ఈసారి ప్రకృతి వైపరీత్యం
- క్షేత్రస్థాయిలో నష్టం అంచనా వేసి ఆదుకోవాలని రైతుల వేడుకోలు

**గండేపల్లి, పెన్ పవర్:** ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి కన్నెర్ర చేయడంతో మెట్ట ప్రాంత రైతుల ఆశలు నీటిపాలయ్యాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు గండేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. ముఖ్యంగా ఎర్రంపాలెం, ఎల్లమిల్లి గ్రామాల్లో మిరప, మినుము, పెసర పంటలతో పాటు అరటి తోటలకు నష్టం వాటిల్లడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

**పెట్టుబడి పెట్టారు.. పంటపై ఆశలు పెంచుకున్నారు**

ఎర్రంపాలెం గ్రామంలో రైతులు ఈ ఏడాది పెద్ద ఎత్తున మిరప సాగు చేపట్టారు. రైతుల వివరాల ప్రకారం గ్రామ పరిధిలోనే 200 ఎకరాలకు పైగా మిరప పంట సాగులో ఉంది. విత్తనాలు, నారు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు ఇలా దశలవారీగా పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టి పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు.పంట చేతికొచ్చే సమయం దగ్గరపడుతుండటంతో అప్పులు తీరుతాయని, కుటుంబ అవసరాలు గట్టెక్కుతాయని రైతులు ఆశించారు. అయితే కొద్ది రోజులుగా కురిసిన భారీ వర్షాలు వారి లెక్కలన్నింటినీ తలకిందులు చేశాయి. పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో మిరప మొక్కలు దెబ్బతింటున్నాయని, పంట నాణ్యత, దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

**ఎకరాకు లక్ష వరకు ఆశలు.. ఇప్పుడు నష్టమే మిగిలిందంటున్న రైతులు**

ఎకరాకు పంట చేతికొచ్చే సమయానికి పెట్టుబడి, ఆదాయంపై కలిపి సుమారు రూ.లక్ష వరకు ఆశలు పెట్టుకున్నామని రైతులు చెబుతున్నారు. పంట బాగా వస్తే అప్పులు తీర్చడంతో పాటు తదుపరి సాగుకు కొంత పెట్టుబడి మిగులుతుందని భావించామని, కానీ అకాల వర్షాలతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వ్యవసాయం అంటే కేవలం పొలంలో పంట మాత్రమే కాదు. దాని వెనుక రైతు కుటుంబం ఏడాది జీవనం, పిల్లల చదువులు, అప్పుల చెల్లింపులు, తదుపరి పంటకు పెట్టుబడి వంటి ఎన్నో అవసరాలు ముడిపడి ఉంటాయి. అందుకే చేతికొచ్చిన పంట కళ్లముందే దెబ్బతింటుంటే ఏం చేయాలో పాలుపోవడం లేదని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు.

**ఎల్లమిల్లిలోనూ అదే పరిస్థితి**

ఎల్లమిల్లి గ్రామంలోనూ వర్షాలు, ఈదురుగాలులు రైతులకు నష్టాన్ని మిగిల్చాయి. మినుము, పెసర పంటలతో పాటు మిరప పంట దెబ్బతినగా, ఈదురుగాలుల ప్రభావంతో అరటి తోటలు కూడా నష్టపోయినట్లు రైతులు చెబుతున్నారు. సాగుకు చేసిన ఖర్చులు తిరిగి వస్తాయో లేదోనన్న ఆందోళన ఇప్పుడు వారిని వెంటాడుతోంది.వర్షం తగ్గిన తర్వాతే పంటలకు జరిగిన పూర్తి నష్టం ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతుందని రైతులు చెబుతున్నప్పటికీ, ప్రస్తుతం పొలాల్లో కనిపిస్తున్న పరిస్థితులు వారిని కలవరపెడుతున్నాయి.

**గతేడాది విత్తనాల దెబ్బ.. ఈసారి వర్షాల దెబ్బ**

"గత ఏడాది నకిలీ విత్తనాల సమస్యతో నష్టపోయాం. ఈ ఏడాదైనా పంట బాగా వస్తుందని ఆశపడ్డాం. ఇప్పుడు వర్షాలు మళ్లీ నష్టాల్లోకి నెట్టాయి" అని పలువురు రైతులు వాపోతున్నారు. వరుసగా ఎదురవుతున్న సమస్యలతో వ్యవసాయం చేయాలంటేనే భయపడాల్సిన పరిస్థితి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి సాగు చేస్తున్న చిన్న, సన్నకారు రైతులకు ఇటువంటి ప్రకృతి వైపరీత్యాలు కోలుకోలేని దెబ్బగా మారుతున్నాయని రైతులు అంటున్నారు. పంట పోతే పెట్టుబడి మాత్రమే కాకుండా తదుపరి పంట సాగు చేసే ఆర్థిక సామర్థ్యం కూడా దెబ్బతింటుందని చెబుతున్నారు.

**అధికారులు పొలాల్లోకి రావాలి**

వర్షాలు తగ్గిన తర్వాత నివేదికలకే పరిమితం కాకుండా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు నేరుగా పంట పొలాలను సందర్శించాలని రైతులు కోరుతున్నారు. గ్రామాల వారీగా మిరప, మినుము, పెసర, అరటి పంటలకు జరిగిన నష్టాన్ని పారదర్శకంగా నమోదు చేసి, వాస్తవంగా నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రకృతి వైపరీత్యాన్ని రైతు ఒంటరిగా ఎదుర్కోలేడని, ప్రభుత్వం తక్షణమే స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం అందిస్తేనే మళ్లీ సాగుకు సిద్ధమయ్యే ధైర్యం వస్తుందని రైతులు అంటున్నారు.పంట చేతికొస్తే అప్పులు తీరుతాయని ఎదురుచూసిన రైతన్నకు ఇప్పుడు పొలంలో నిలిచిన వర్షపు నీరే కనిపిస్తోంది. ఆ నీరు త్వరగా తగ్గాలని రైతు కోరుకుంటుంటే... తన కష్టానికి జరిగిన నష్టాన్ని ప్రభుత్వం గుర్తించి చేయూతనివ్వాలని ఆశగా ఎదురుచూస్తున్నాడు.

# రెండో రోజు దీక్షా శిభిరాన్ని సంఘీబావం తెలిపిన వివిధ పార్టీ నాయకులు....

**ప్రజల ప్రశాంత జీవనం కోసమే రిలే నిరాహార దీక్ష....**

**ప్రజలను అణచివేసే అభివృద్ధి ఎవ్వరి కోసం....**

**ప్రజలు కదిలితేనే ప్రభుత్వాలు కదులుతాయి...**









**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 26:-** గ్రామాలంటేనే పచ్చని ప్రకృతి అందాలతో నిండిన వాతావరణానికి, ప్రజల ప్రశాంత జీవనానికి చిహ్నాలుగా నిలుస్తాయి. అటువంటి పల్లెలు నేడు మైనింగ్ మాఫియా చేతిలో నిలువు దోపిడీకు గురవుతూ పల్లెల ప్రశాంత జీవన విధానాన్ని మైనింగ్ తరలించే టిప్పర్లు దుమ్ము, ధూళితో అస్తవ్యస్తం చేస్తున్నాయి. దీనితో విసిగి వేసారిపోయిన కొందరు యువకులు పార్టీలకతీతంగా శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం పేరుతో ఒక కమిటీని ఏర్పాటు చేసి, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు శంఖవరం గ్రామం మీదుగా టిప్పర్ల రాకపోకలను నిలుపు చేయండని పలుమార్లు పిర్యాదులు చేసారు. కాని వాటికి నేటి వరకు ఎటువంటి సమాధానం లేకపోగా ఈ మార్గంలో మరిన్ని టిప్పర్లు పెరిగిపోయాయి. ఇక చేసేదేమీ లేకపోవడంతో శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం ఐదు రోజుల పాటు రిలే నిరాహార దీక్షను శాంతియుతంగా చేపట్టి ప్రభుత్వానికి తమ గళం వినిపించాలని నిర్ణయించింది. గడిచిన శుక్రవారం ప్రారంభించిన దీక్ష విజయవంతం కావడంతో నేడు (శనివారం) రెండో రోజుకు చేరుకుంది. రెండో రోజు దీక్షా శిభిరాన్ని తాజా మాజీ ఎంపీపి పర్వత రాజబాబు హాజరై, తన సంఘీబావం తెలిపి, గడిచిన కొన్నేళ్ళుగా శంఖవరం గ్రామం మీదుగా నడుస్తున్న టిప్పర్ల వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారని, ఈ టిప్పర్లకు బైపాస్ రహదారి నిర్మించినప్పుడే శంఖవరం ప్రజలకు ఉపశమనం కలుగుతుందన్నారు. బైపాస్ రహదారి నిర్మాణం విషయంలో రైతులతో చర్చించేందుకు తాను ఎప్పుడూ అందుబాటులోనే ఉంటానన్నారు. అనంతరం దీక్షా శిభిరానికి ప్రత్తిపాడు వైసిపి ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు శంఖవరం మండలం పార్టీ శ్రేణులతో చేరుకుని దీక్షలో రెండవ రోజు కూర్చున్న మహిళలకు, సేవా సంఘం సభ్యులకు తమ సంఘీబావం ప్రకటించారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ శంఖవరం గ్రామ ప్రజలు అసాధ్యమైన కోర్కెలు కోరడం లేదని, ప్రజలు వారి బిడ్డల భవిష్యత్తు కోసం, స్వచ్ఛమైన గాలి కోసం కష్టపడి కట్టుకున్న గృహాలు వది కాలాల పాటు ఉండాలని, వారు కుటుంబం ప్రశాంతంగా బ్రతకడం కోసమే శంఖవరంలో ఉద్యమం ప్రారంభమైనదన్నారు . ప్రజల ఆవేదనను, బాధను తాము అర్థం చేసుకున్నామని, ఈ ఉద్యమం సఫలం కావాలంటే గ్రామంలో ప్రతీ ఒక్కరూ కదిలి వచ్చి ఉద్యమానికి బాసటగా నిలవాలన్నారు. మీరంతా ముందడుగు వేస్తే మీ వెనుక వైసిపి పార్టీ అండగా నిలుస్తుందని గిరిబాబు భరోసా నిచ్చారు. ఈ సమస్య ప్రతీ ఒక్కరిదీ. అంతా సమైక్యంగా పోరాడాల్సిన సమయం వచ్చింది. లేనిపక్షంలో ఇలానే టిప్పర్లు తిరుగుతుంటే కొన్ని రోజుల్లో నేడు గ్రామాలు, తర్వాత మండలాలు ఖాళీ అవుతాయన్నారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, కాని అభివృద్ధి పేరుతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ చేసేది అభివృద్ధి కాదని, ఆది అరాచకమన్నారు. ప్రతీ ఒక్కరు ప్రశ్నించినపుడే ప్రభుత్వాలు దిగి వస్తాయన్నారు. ఈ రిలే నిరాహార దీక్షకు సోమవారం ఉదయం నుండి తాను, వైసిపి పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో పాల్గొంటామని, టిప్పర్ల సమస్యను అధిగమించేందుకు బైపాస్ రహదారి నిర్మించుకునే వరకు ఉద్యమం కొనసాగాలని, తాము అండగా ఉంటామన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్ఛార్జ్ ఉమ్మిడి వెంకట్రావు దీక్ష శిభిరానికి చేరుకుని సంఘీబావం తెలిపి, తమ సంపూర్ణ మద్దతును తెలిపారు. ఇది 13 గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న అక్రమ మైనింగ్ ను తరలించే టిప్పర్లు సృష్టిస్తున్న తీవ్రమైన సమస్య అని, దీనిని ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. మాజీ కేంద్ర మంత్రి ఎంఎం పల్లంరాజు, జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యనందరావు ఆదేశాలతో తాను వచ్చానని, త్వరలోనే వారు దీక్ష శిభిరానికి వచ్చి సంఘీబావం తెలుపుతారన్నారు. మాజీ ఎమ్మెల్సీ, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి అంగూరి లక్ష్మీ శివకుమారి దీక్షా శిభిరానికి చేరుకుని తమ సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీ శివ కుమారి మాట్లాడుతూ ఈ రిలే నిరాహార దీక్షలో మహిళలు పాల్గొనడం సమస్య తీవ్రతరాన్ని గుర్తు చేస్తుందన్నారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు ఈ ఉద్యమం కొనసాగాలన్నారు. తాను కూడా సోమవారం గిరిబాబుతో పాటు దీక్షలో పాల్గొంటానన్నారు. సంఘీభావం తెలిపిన వారిలో వైసిపి నేతలు గౌతు వాసు, అడపా సోమేష్, నరాల శ్రీను, సకురు గుర్రాజు, గౌతు రోహిత్, చల్లా సత్యప్రసాద్, సప్పా రాంబాబు, వెలుగుల రవి ఉన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మేకల కృష్ణ, ఉపాధ్యక్షుడు గునపర్తి అపురూప్, కార్యదర్శి పర్వత రామకృష్ణ, సభ్యులు పగడాల బాబ్జి, గుద్దాటి నాగేశ్వరరావు, బొమ్మిడి చిట్టిబాబు, బొర్రా సత్తిబాబు, కొంగు రమేష్, రేలంగి వెంకట సత్యనారాయణ, పడాల కృష్ణమూర్తి, బత్తిన తాతాజీ, గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

# వాడపల్లి వెంకన్న సన్నిధిలో భక్తజన వెల్లువ





- వేకువజాము నుంచే పోటెత్తిన భక్తులు.. తొలి హారతికి విశేష స్పందన
- భక్తులకు విస్తృత అన్నప్రసాద వితరణ.. శనివారం రూ.55 లక్షల వరకు ఆదాయం

**ఆత్రేయపురం పెన్ పవర్, సెప్టెంబర్ 26:**కోనసీమ తిరుమలగా ఆధ్యాత్మిక వైభవాన్ని సంతరించుకున్న వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి క్షేత్రం శనివారం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. ఏడువారాల వెంకన్నగా భక్తుల విశేష విశ్వాసాన్ని చూరగొంటున్న స్వామివారి దర్శనార్థం తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు వేకువజాము నుంచే వాడపల్లికి తరలివచ్చారు. తెల్లవారుజామునే ఆలయ పరిసరాలు భక్తుల రాకతో కళకళలాడగా, స్వామివారి నామస్మరణలతో క్షేత్ర ప్రాంగణం మార్మోగింది.
శనివారం ప్రత్యేకతను సంతరించుకున్న తొలి హారతి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తులు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ పరిసరాల్లోని ఆధ్యాత్మిక వాతావరణంలో కొద్దిసేపు గడిపి, స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

**భక్తులకు అన్నప్రసాద వితరణ**

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత పులిహోర అన్నప్రసాద వితరణకు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనం, ప్రసాద వితరణ తదితర అంశాల్లో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు.

**ఒక్కరోజులో రూ.55 లక్షల వరకు ఆదాయం**

భక్తుల విశేష రాకతో శనివారం దేవస్థానానికి గణనీయమైన ఆదాయం సమకూరినట్లు డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. శనివారం ఒక్కరోజే సుమారు రూ.55 లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. భక్తుల విశ్వాసం, స్వామివారి దర్శనానికి పెరుగుతున్న ఆదరణకు ఈ రాక ప్రతిబింబంగా నిలిచిందని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి.

**ఆధ్యాత్మిక శోభతో వాడపల్లి**

వేకువజాము నుంచే భక్తుల రాకతో వాడపల్లి ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. శ్రీవారి నామస్మరణలు, భక్తుల పూజా కార్యక్రమాలు, అన్నప్రసాద వితరణతో వాడపల్లి క్షేత్రం భక్తి పారవశ్యానికి వేదికగా నిలిచింది. ఏడువారాల వెంకన్న దర్శనం కోసం ప్రతి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుండటంతో దేవస్థానం అధికారులు



భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

# పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**గండేపల్లి,పెన్ పవర్, సెప్టెంబర్ 26:**గండేపల్లి మాజీ సర్పంచ్ లంజపల్లి రామకృష్ణ అనారోగ్య కారణంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. శనివారం జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ ఆయనను ఇంటి వద్ద కలిసి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించి ధైర్యం చెప్పారు. అనంతరం గండేపల్లి టీడీపీ నాయకులు బొల్లిన వేణుగోపాల్ తండ్రి, గండేపల్లి గ్రామ పంచాయతీ సీనియర్ వార్డు సభ్యులు బొల్లిన వెంకట్రావు ఇటీవల మరణించడంతో వారి నివాసానికి వెళ్లారు. వెంకట్రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేణుగోపాల్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, జిల్లా టీడీపీ కార్యాలయ కార్యదర్శి కోర్పు సాయి తేజ, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి కన్నబాబు, జాస్తి వసంత్, బొల్లం రెడ్డి రామకృష్ణ, చాగంటి వీర వెంకట సత్యనారాయణ, కంటిపూడి రామారావు, సుంకవిల్లి రమేష్, చిటికెల కన్నబాబు, వెంపాటి సతీష్, ముంగర సూర్యారావు, చాగంటి



కృష్ణమోహన్, ఆళ్ల సత్తిబాబు, పైల వెంకన్న, ముంగర విష్ణు, కంటిపూడి జమ్మి, గరికపాటి రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య కళాశాలలో ఆంగ్ల భాషా అనుసంధానంపై సెమినార్




**ప్రపంచ కమ్యూనికేషన్‌కు ఆంగ్ల భాషే వారధి**
**జేఎన్‌టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. కృష్ణారావు**

**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 26 :**ప్రస్తుత ప్రపంచంలో వివిధ ప్రాంతాలు, భాషలు,సంస్కృతులకు చెందిన ప్రజల మధ్య ఆంగ్ల భాష అనుసంధాన వారధిగా పనిచేస్తోందని జేఎన్‌టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. కృష్ణారావు పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న పోటీని ఎదుర్కొని, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ఆంగ్ల భాషా నైపుణ్యాలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. లక్ష్మీనారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో శనివారం "అనుసంధాన భాషగా ఆంగ్లం" అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ఆంగ్ల భాష ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణారావు మాట్లాడుతూ, ఆంగ్లం కేవలం పరీక్షల కోసం చదివే ఒక సబ్జెక్టు మాత్రమే కాదని,తమ ఆలోచనలను స్పష్టంగా వ్యక్తపరచడానికి, ఆత్మవిశ్వాసంతో ఇతరులతో సంభాషించడానికి ఉపయోగపడే ముఖ్యమైన నైపుణ్యమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆంగ్లంలో మాట్లాడటం, రాయడం, భావాలను సమర్థవంతంగా వ్యక్తపరచడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్.నాయుడు మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు ఉద్యోగ అవకాశాల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలు ఎంతో కీలకమని తెలిపారు. ముఖ్యంగా క్యాంపస్ ప్లేస్‌మెంట్లు,ఉద్యోగ ఇంటర్వ్యూలలో సమర్థవంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలు అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు ఇప్పటి నుంచే భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

విద్యార్థులకు పోటీలు. సెమినార్‌లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, ఎలోక్యూషన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఆంగ్ల భాషపై విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించడంతోపాటు,వారి వక్తృత్వం,వ్యక్తీకరణ నైపుణ్యాలను మెరుగుపరచడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆంగ్ల విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు.

కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ,ఆంగ్ల విభాగాధిపతి ఎల్.వి.ప్రసాద్,అధ్యాపకులు శోభ, సరోజ,ఉమాదేవి,రెమలా దేవన్,భద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో పీజీ ప్రవేశాలకు అవకాశం






**కాకినాడ రూరల్, పెన్ పవర్,సెప్టెంబర్ 26 :** ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్లు క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. ప్రశాంతి శ్రీ తెలిపారు. ఏపీ పీజీసెట్ ద్వారా ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్సీ కోర్సులకు మొదటి విడత, ఏపీ ఐసెట్ ద్వారా ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు రెండో విడత సీట్ల కేటాయింపు ఈ నెల 28, 29, 30 తేదీల్లో జరగనున్నట్లు వెల్లడించారు. ప్రతి పీజీ విభాగంలో 33 సీట్లు, ఎంబీఏ, ఎంసీఏ విభాగాల్లో 66 సీట్ల చొప్పున భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అందుబాటులో ఉన్న కోర్సుల్లో ఎం.ఏ. ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఇంగ్లీష్, ఎం.ఎస్సీ మ్యాథమెటిక్స్, ఎం.కాం., ఎంబీఏ, ఎంసీఏ ఉన్నాయని పేర్కొన్నారు. క్యాంపస్‌లో ఆధునిక స్మార్ట్ క్లాస్‌రూములు, అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు, డిజిటల్ లెర్నింగ్ సెంటర్లు, విశాలమైన కేంద్ర గ్రంథాలయం, బాలుర, బాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి, క్రీడా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ వివరించారు. ప్రశాంతమైన విద్యా వాతావరణంలో నాణ్యమైన విద్యను అందించేందుకు క్యాంపస్ సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ ప్రోత్సాహకాలు అర్హులైన విద్యార్థులకు అందుతాయని స్పష్టం చేశారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ ప్రవేశ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం అడ్మిషన్స్ ఇన్‌చార్జ్ కరీం (9701827564)ను సంప్రదించాలని లేదా కాకినాడ రూరల్, అచ్చంపేట జంక్షన్‌లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్‌ను నేరుగా సందర్శించాలని ప్రిన్సిపాల్ కోరారు.

## బొడ్డు విష్ణుమూర్తి మరణం పార్టీకి తీరని లోటు



**మంత్రి వాసంశెట్టి సుభాష్**

**కాజులూరు, సెప్టెంబర్ 26 పెన్ పవర్:** కాజులూరు మండల పరిషత్ మాజీ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కీర్తిశేషులు బొడ్డు విష్ణుమూర్తి అకాల మరణం పార్టీకి, కాజులూరు మండల ప్రజలకు తీరని లోటని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. శనివారం రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలం ఆర్యవటం గ్రామంలోని విష్ణుమూర్తి స్వగృహానికి వెళ్లిన మంత్రి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, బొడ్డు విష్ణుమూర్తి ప్రజలతో మమేకమై పనిచేసిన నాయకుడని,పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన అంకితభావం కలిగిన నేతగా కొనియాడారు. మండల పరిషత్ అధ్యక్షుడిగా ప్రజా సమస్యల పరిష్కారానికి విశేష సేవలందించారని గుర్తు చేశారు. పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని,నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేస్తూ అందరి అభిమానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. విష్ణుమూర్తి మరణంతో పార్టీ ఒక అనుభవజ్ఞుడైన నాయకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

విష్ణుమూర్తి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి, గుత్తుల బుల్లిరాజు,కొల్లి హనుమంతరావు, చందాల మల్లిబాబు,చందాల ఆదినారాయణ,కూటమి నాయకులు, కార్యకర్తలు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ర్యాలిలో వైభవంగా బుజ్జి గణపతి ఊరేగింపు

**రంగురంగుల వేషధారణలతో చిన్నారుల సందడి.. భక్తిశ్రద్ధలతో కొనసాగిన నిమజ్జన శోభాయాత్ర**



**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 26:**మండలం లో ర్యాలి గ్రామంలోని త్రిమూర్తి నగర్‌లో ప్రతిష్ఠించిన బుజ్జి గణపతి నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా చిన్నారులు, భక్తులు పాల్గొన్న గణనాథుని గ్రామ ఊరేగింపు అత్యంత వైభవంగా నిర్వహించారు. బుజ్జి గణపతిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై కొలువుదీర్చి, దాని వెనుక డీజే సౌండ్స్, సంప్రదాయ వాయిద్యాల నడుమ చిన్నారులు రంగురంగుల వేషధారణలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. గణపతి నామస్మరణలు, భక్తిగీతాలతో ర్యాలి పురవీధులు మార్మోగాయి.

ఊరేగింపు సాగుతున్న మార్గంలో భక్తులు గణనాథునికి భక్తిశ్రద్ధలతో స్వయంపాకాలు సమర్పించి, ఆశీస్సులు పొందారు. చిన్నారుల ఉత్సాహం, భక్తుల సందడి, రంగురంగుల అలంకరణలతో ర్యాలి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. త్రిమూర్తి నగర్ నుంచి ప్రారంభమైన ఈ శోభాయాత్ర గ్రామంలోని ప్రధాన పురవీధుల మీదుగా వైభవంగా కొనసాగింది.

## వాడపల్లి వెంకన్న సన్నిధిలో జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్

**భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. ఆలయ మర్యాదలతో తీర్థప్రసాదాల అందజేత**



**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 26:**కోనసీమ తిరుమలగా ఖ్యాతిగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి సన్నిధిలో శనివారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్ఛారణల నడుమ స్వామివారి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో సేవలందుకుని, తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా దేవస్థాన డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆలయ మర్యాదలతో స్వామివారి తీర్థప్రసాదాలను బండారు శ్రీనివాస్‌కు అందజేశారు. అనంతరం ఆలయానికి సంబంధించిన వివరాలను ఆయనకు తెలియజేశారు. కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు చింతపల్లి సత్యనారాయణ, తమ్మన సాయి ప్రసాద్, శిష్ట కుటుంబరావు, చలుమూరి రాంబాబు, వాడపల్లి సుందర శేషావతారం, ఏపుగంటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. స్వామివారి దర్శనంతో ఆధ్యాత్మిక పరవశానికి లోనైన బండారు శ్రీనివాస్, భక్తులకు వెంకటేశ్వర స్వామివారి అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.

## మేడిశెట్టి బాబీతో యనమల కృష్ణుడు మర్యాదపూర్వక భేటీ.....

**కత్తిపూడిలో బాబీ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన యనమల కృష్ణుడు...**



**శంఖవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 26:**-జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి ఇటీవల జనసేన పార్టీలో చేరిన తుని నియోజకవర్గ సీనియర్ నాయకుడు యనమల కృష్ణుడు..జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్ (కత్తిపూడి బాబీ)ను కత్తిపూడిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేడిశెట్టి బాబీ.. యనమల కృష్ణుడుకు పుష్పగుచ్ఛం అందజేసి,శాలువాతో సత్కరించి జనసేన పార్టీలో చేరినందుకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇరువురు జనసేన పార్టీ బలోపేతం,నియోజకవర్గాల్లో పార్టీ కార్యకలాపాల విస్తరణ తదితర అంశాలపై చర్చించినట్లు తెలిసింది.

## చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందివ్వాలి.

**-పోషణ మాసోత్సవాల కార్యక్రమంలో సిడిపిఓ,ఎం పూర్ణిమ.**



**కిర్లంపూడి, పెన్ పవర్, సెప్టెంబర్, 26:** చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందివ్వాలని జగ్గంపేట ఐసిడిఎస్ సిడిపిఓ, ఎం పూర్ణిమ అన్నారు. పోషణ మాసోత్సవాల్లో కార్యక్రమాల్లో భాగంగా కిర్లంపూడి మండలం సింహాద్రిపురం, జగపతి నగరం గ్రామాల్లో సీడీపీఓ, ఎం పూర్ణిమ అధ్యక్షతన పోషణ మాసోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ మన పిల్లలు ఆరోగ్యంగా పెరగాలంటే కేవలం కడుపు నిండా ఆహారం అందివ్వడం మాత్రమే కాదని శరీరానికి అవసరమైన అన్ని పోషకాలు అందేలా వైవిధ్యమైన ఆహారం ఇవ్వాలన్నారు.

ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పులు,గుడ్లు,పాలు, చిరుధాన్యాలు వంటి స్థానికంగా లభించే ఆహార పదార్థాలను మన రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలకు వయస్సుకు తగిన ఆహారం ఇవ్వడం చాలా అవసరమన్నారు. పిల్లల బరువు,ఎత్తు, ఎదుగుదలను క్రమం తప్పకుండా పరిశీలించాలన్నారు. పిల్లల ఆరోగ్యానికి పరిశుభ్రత కూడా చాలా ముఖ్యమన్నారు. భోజనం ముందు, మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులు సబ్బుతో కడుక్కోవడమే కాకుండా, పరిశుభ్రమైన నీటిని తాగాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మన పిల్లలకు మనం ఇచ్చే గొప్ప బహుమతి ఆరోగ్యమేనన్నారు. మండల బిజెపి అధ్యక్షుడు శరకణం రాజబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు , ఏఎన్ఎంలు , ఆశా కార్యకర్తలు,సూపరవైజర్ సునీత,బూసమ్మ,గ్రామ పెద్దలు,యువత,మహిళలు పాల్గొన్నారు.

## శంఖవరం కేజీబీవీ ఆకస్మికంగా సందర్శించిన సమగ్ర శిక్ష అదనపు సమన్వయకర్త వి వి వి సత్య నారాయణ...



**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 26:-** కాకినాడ జిల్లా సమగ్ర శిక్ష జిల్లా అదనపు సమన్వయకర్త వి వి వి సత్య నారాయణ ఆకస్మికంగా కేజీబీవీ , శంఖవరం పాఠశాలను సందర్శించడం జరిగింది. సందర్శనలో భాగంగా ,ఇంటర్మీడియట్, 10వ తరగతి మరియు 6వ తరగతి విద్యార్థులతో మాట్లాడి విద్యా ప్రగతిని తెలుసుకున్నారు.ఎఫ్ ఎ -1 యూనిట్ పరీక్షల మార్కులను పరిశీలించి, విద్యార్థులు 100% ఫలితాలు సాధించేలా కష్టపడి చదవాలని సూచించారు.

6వ తరగతి నుండి 8వ తరగతి వరకు వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

హాస్టల్ మెనూను పరిశీలించి, భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

పాఠశాల పరిసరాలలో జరుగుతున్న లాబ్స్ నిర్మాణం పనులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని తగిన సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. ఇంకా పాఠశాలకు అవసరమైన వసతులు అడిగి తెలుసుకోవడం జరిగింది.

## ఎమ్మెల్యే నెహ్రూకు వినతిపత్రం అందజేసిన వీఆర్ఏలు



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 26 :** వీఆర్ఏ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి పిలుపు మేరకు చేపట్టిన సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా 11 వ రోజు కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, గోకవరం మండలాల వీఆర్ఏ లు సమ్మెను కొనసాగిస్తున్నారు. శనివారం కాకినాడ జిల్లా విఆర్ఎ ల సంఘం అధ్యక్షులు నిడమర్తి సురేష్ ఇశ్రాయేలు ఆధ్వర్యంలో జగ్గంపేట నియోజకవర్గంలో గల నాలుగు మండలాలు జగ్గంపేట, గోకవరం, గండేపల్లి, కిర్లంపూడి మాడలాల విఆర్ఎలు జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయం నుండి రావులమ్మ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించుకుంటూ వచ్చి జగ్గంపేట ఎమ్మెల్యే , తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మండలం అధ్యక్షులు ఇస్సాకు, గోకవరం అధ్యక్షులు సుబ్బారావు, గండేపల్లి అధ్యక్షులు శ్రీనివాస్, కిర్లంపూడి నుండి ప్రతాప్, దేవి, లక్ష్మి మరియు నియోజకవర్గం లో ఉన్న వి ఆర్ ఎ లు అందరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీఆర్ఏ లు మాట్లాడుతూ గత 8 సంవత్సరాలుగా ఒక్క రూపాయి కూడా జీతం పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వస్తున్న రూ.10500 జీతంతో నిత్యావసర ధరలు పెరిగిన నేపథ్యంలో కుటుంబ పోషణ భారంగా మారిందని, అర్ధాకలితో పస్తులు ఉండాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. గత 10 రోజులుగా తహసిల్దార్ కార్యాలయాల వద్ద టెంట్లు వేసుకుని నిరసన తెలుపుతున్నామని పేర్కొన్నారు. దీనిపై ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్పందిస్తూ మీ న్యాయమైన కోరికలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కార దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఇస్సాకు, కార్యదర్శి మౌళి, పెద్దాపురం డివిజన్ ఉపాధ్యక్షులు చిట్టిబాబు, మండల జాయింట్ కార్యదర్శి ప్రభావతి, ఉపాధ్యక్షులు అర్జునుడు, మండల వీఆర్ఏ లు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడులో ఘనంగా పోషకాహార మహోత్సవాలు



**కిర్లంపూడి,ప్రత్తిపాడు,పెన్ పవర్,సెప్టెంబర్,26:**ప్రత్తిపాడులో అంగన్వాడీ కేంద్రం-8లో పోషకాహార మహోత్సవాలు,శనివారం ఘనంగా నిర్వహించారు.ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి టిడిఆర్ పద్మావతి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు,గర్భిణీలు,బాలింతలకు అందుతున్న వివిధ సేవలను వివరించారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పోషకాహారం,ఆరోగ్య సేవలు,ఇతర సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లులు,గర్భిణీలు,బాలింతలకు సూచించారు.అనంతరం అంగన్వాడీ కార్యకర్తలను శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సింగిలిదేవి సత్తిరాజు,వెలుగుల నాని, ముత్యాల రాంబాబు,మదినే దొరబాబు,చిలకమర్తి వీరభద్రరావు,మదినే బాబ్జి,బొబ్బర ప్రసాద్,సూపర్‌వైజర్ ఎన్ వరలక్ష్మి,అంగన్వాడీ కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు,తల్లులు,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పౌర్ణమి గరుడసేవ



**ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**భాద్రపద పౌర్ణమి సందర్భంగా చింతలూరు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో పౌర్ణమి గరుడసేవను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా సహస్ర దీపాలంకరణ సేవ అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను గరుడాళ్వార్ పై వేంచేపు చేయించి భక్తులచే విష్ణు సహస్రనామార్చన పారాయణం, ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గ్రామోత్సవం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

# వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ముదునూరి మురళీకృష్ణంరాజుకు పితృవియోగం..





**-ఫోన్లో పరామర్శించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్.**

**-ప్రత్తిపాడు వైసిపి ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబుతో పాటు,పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం.**

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, సెప్టెంబర్,26:**వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి,నరసాపురం పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకులు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు పితృవియోగానికి గురయ్యారు.మండలంలోని ధర్మవరంలో నివాసముంటున్న మురళీ కృష్ణంరాజు తండ్రి ముదునూరి రామరాజు (87) శనివారం ఉదయం అస్వస్థతకు గురై ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందారు.ఆయనకు ట్రస్ట్ వైస్ చైర్మన్ ముదునూరి సీతారామరాజు,మురళీ కృష్ణంరాజుతోపాటు ఐదుగురు కుమార్తెలు సంతానం.రామరాజు మృతి విషయం తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మురళీకృష్ణంరాజుకు ఫోన్లో పరామర్శించారు.మురళీకృష్ణంరాజు తండ్రి మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేసి,కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ,జ్యోతుల చంటిబాబు,మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీశివకుమారి తదితరులు ధర్మవరంలోని ముదునూరి నివాసానికి చేరుకుని రామరాజు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మురళీకృష్ణరాజు కుటుంబ సభ్యులకు తీవ్ర సంతాపాన్ని,సానుభూతిని తెలియజేశారు. చోడవరం జడ్పీటీసీ దొండ రాంబాబు, అన్నవరం దేవస్థానం మాజీ పాలకమండలి సభ్యుడు బుద్ధరాజు గోపిరాజు, తాజా మాజీ ఎంపీపీ గోళ్ళ క్రాంతి సుధాకర్, మాజీ సర్పంచులు బెంతికుర్తి సుశీల, పుణ్యమంతుల కామరాజు, గ్రామ పెద్దలు బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, పుణ్యమంతుల శ్రీను, బొండాడ నారాయుడు, బొల్లు నాగేశ్వరరావు, నిమ్మల నాని, బి చంటిరాజు, జువ్వల చినబాబు, బాబులు, కొండపల్లి అప్పారావు, దడాల సతీష్, ముప్పనబోయిన ఏసుబాబు, కోలా తాతబాబు, యాళ్ల ఏసుబాబు తదితరులు రామరాజు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.అనంతరం నియోజకవర్గం వ్యాప్తంగా పార్టీలకతీతంగా తరలివచ్చిన వందలాది మంది నాయకులు,కార్యకర్తలు,అభిమానుల రామరాజు అంతిమ యాత్రలో పాల్గొన్నారు. అనంతరం ముదునూరి వ్యవసాయ క్షేత్రంలో రామరాజు అంత్యక్రియలు నిర్వహించారు.

## గొల్లప్రోలులో సన్న బియ్యం పంపిణీ కేంద్రం ఆకస్మిక తనిఖీ





- **కౌంటర్లలో నిరంతరం బియ్యం అందుబాటులో ఉంచాలి**
- **ప్రభుత్వ నిబంధనల మేరకు పారదర్శకంగా విక్రయాలు జరపాలి: జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్**

**గొల్లప్రోలు/కాకినాడ ,సెప్టెంబర్ 26 ,పెన్ పవర్:**పెరుగుతున్న బియ్యం ధరలను నియంత్రించి, ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యాన్ని తక్కువ ధరకే అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాన్ని పారదర్శకంగా అమలు చేయాలని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు.శనివారం గొల్లప్రోలులోని స్వామి అయ్యప్ప రైస్ ట్రేడర్స్‌లో సన్న బియ్యం పంపిణీ కేంద్రాన్ని ఆయన పౌరసరఫరాల శాఖ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కౌంటర్‌లో ఉన్న బియ్యం నిల్వలు, ధరల పట్టిక, డిజిటల్ యాప్ ద్వారా జరుగుతున్న విక్రయాలను పరిశీలించారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతిరోజూ విక్రయాలు నిర్వహించాలని, తగినంత బియ్యం నిల్వలను అందుబాటులో ఉంచుకోవాలని మిల్లు యజమాని వెలుగుల మహీంద్రరావును ఆదేశించారు.ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో సన్న బియ్యం కౌంటర్ల నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ,వినియోగదారులకు నాణ్యమైన బియ్యాన్ని నిర్ణీత ధరలకు విక్రయించాలని స్పష్టం చేశారు.

**వినియోగదారులకు స్వయంగా బియ్యం విక్రయం**

తనిఖీ అనంతరం కౌంటర్‌కు వచ్చిన వినియోగదారులకు జాయింట్ కలెక్టర్ స్వయంగా బియ్యం విక్రయించి, పది కిలోల బియ్యాన్ని అందజేశారు. జిల్లాలోని మిగిలిన అన్ని ప్రత్యేక కౌంటర్లలోనూ బియ్యం కొరత లేకుండా నిరంతరం నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారిణిని ఆదేశించారు.

**కిలో సూపర్ ఫైన్ బియ్యం రూ.52, సాధారణ బియ్యం రూ.50**

మార్కెట్‌లో బియ్యం ధరలను నియంత్రించి, సామాన్య ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన బియ్యాన్ని అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక విక్రయ విధానాన్ని అమలు చేస్తోందని జేసీ వివరించారు.ఈ విధానంలో సూపర్ ఫైన్ బియ్యం కిలో రూ.52, సాధారణ బియ్యం కిలో రూ.50 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం కాకినాడ జిల్లా వ్యాప్తంగా 36 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. కాకినాడ, పెద్దాపురం రైతు బజార్లతో పాటు రైస్ మిల్లుల వద్ద, ప్రధాన మార్కెట్లలో ఈ కౌంటర్లు అందుబాటులో ఉన్నాయన్నారు.రేషన్ కార్డు, ఆధార్ కార్డు కలిగిన వినియోగదారులు నెలకు 5 నుంచి 26 కిలోల వరకు సన్న బియ్యాన్ని పొందవచ్చని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 8,942 మంది వినియోగదారులకు ప్రయోజనం చేకూరిందని, మొత్తం 1,139.72 క్వింటాళ్ల బియ్యాన్ని పంపిణీ చేసినట్లు వెల్లడించారు.ప్రజలందరూ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని, నిర్దేశిత ధరలకే నాణ్యమైన బియ్యాన్ని పొందాలని జాయింట్ కలెక్టర్ కోరారు.ఈ తనిఖీలో కాకినాడ జిల్లా పౌరసరఫరాల అధికారిణి టి. ప్రసన్న లక్ష్మీదేవి, పిఠాపురం పౌరసరఫరాల డిప్యూటీ తహశీల్దార్ వి. సంధ్య, గొల్లప్రోలు ఆర్.ఎస్.డి.టి. మస్తాని తదితరులు పాల్గొన్నారు.

## మోదీ "సేవా సంకల్ప్ అభియాన్" లో భాగంగా బిజెపి నాయకులు అంగన్వాడీ కేంద్రం సందర్శన



**కొత్తపేట పెన్ పవర్ సెప్టెంబర్ 26:**ప్రధాని మోదీ జన్మదిన మాసోత్సవాలు, సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగాశనివారం వానపల్లి శివారు ఐఎస్ రాజు నగర్ లో కోడ్ నెంబర్ 126 అంగన్వాడీ కేంద్రాన్ని బిజెపి నాయకులు సందర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బిజెపి నియోజకవర్గ ఇంఛార్జి పాలూరి సత్యానందం విచ్చేసారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు అంగన్వాడీ కేంద్రంలో గర్భవతులకు, బాలింతరాళ్లకు, పిల్లలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, బియ్యం, పప్పు, కోడిగుడ్లు ఇంకా అనేక రకాల ఆహారాలను వసతులను పరిశీలించారు. అనంతరం పిల్లలు మహిళలతో సమావేశమై కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను ప్రతిఒక్కరు ఉపయోగించుకోవాలని కోరారు. అంగన్వాడీ సూపర్ వైజర్ వై. హిమశ్రీ మాట్లాడుతూ మహిళలు, గర్భవతులు, పిల్లలకు అంగన్వాడీ ద్వారా 4 విధాల పథకాలు అందిస్తున్నారని, మాతా శిశు సంక్షేమానికి కూడా అనేక పథకాలున్నాయని ప్రతినెల స్థానిక పిహెచ్సీ లో మహిళలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. అనంతరం అంగన్వాడీ టీచర్లు బి. డి. వి లక్ష్మి, మల్లాడి మీనా, అంగన్వాడీ ఆయా సిద్దుల శ్రీదేవి కి బిజెపి నాయకులు దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గొలకోటి రామలక్ష్మి వెంకటేశ్వరరావు, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి కోటిపల్లి సుబ్రహ్మణ్యం, మరొక మండల ప్రధాన కార్యదర్శి బళ్ల మూలాస్వామి,మండల ఉపాధ్యక్షులు ఇళ్ల పళ్ళంశెట్టి, సేవా సంకల్ప్ అభియాన్ కో కన్వీనర్ కోటిపల్లి దామోదర్,ఎస్సీ మోర్చ మండల అధ్యక్షుడు తరిట్ల శివరామకృష్ణ, కోటిపల్లి పళ్లంరాజు, డాక్టర్ బాబు, ఉండ్రాజవరపు నాగేశ్వరావు, ఇళ్ల సూర్యనారాయణ, బళ్ల సత్యనారాయణ స్థానిక మహిళలు, గర్భవతులు, తల్లులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి




- **ఎఫ్ఏ--2 పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలి**
- **స్కూల్ కాంప్లెక్స్‌లు బోధనా నైపుణ్యాల వికాసానికి వేదికలుగా నిలవాలి: డీఈఓ మహబూబ్ బాషా**

**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 26:**విద్యార్థుల అభ్యసన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు నిరంతరం తమ బోధన, అభ్యసన నైపుణ్యాలను పదును పెట్టుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ మహబూబ్ బాషా సూచించారు. ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్య వికాసానికి స్కూల్ కాంప్లెక్స్‌లు సమర్థవంతమైన వేదికలుగా ఉపయోగపడాలని ఆయన పిలుపునిచ్చారు.ఆత్రేయపురం మండలం అంకంపాలెం జెడ్పీ పాఠశాలలో శనివారం నిర్వహిస్తున్న ప్రైమరీ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని డీఈఓ మహబూబ్ బాషా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడిన ఆయన పాఠశాలల్లో విద్యాబోధన, విద్యార్థుల ప్రగతి, అభ్యసన ఫలితాలపై ఆరా తీశారు.అక్టోబర్ 5వ తేదీ నుంచి నిర్వహించనున్న ఎఫ్ఏ--2 పరీక్షలకు విద్యార్థులను సమగ్రంగా సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులలోని ప్రతిభ, సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రతి శనివారం పాఠశాలల్లో నో బ్యాగ్ డేను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. అలాగే ప్రతి పాఠశాలలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి, విద్యార్థులకు పంజాబీ భాషను పరిచయం చేయాలని సూచించారు.ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలను డీఈఓ పరిశీలించారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న హెచ్ఎం పరిమళ కుమారి, ఉపాధ్యాయులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న ఈ--మ్యాగజైన్ కార్యక్రమం గురించి హెచ్ఎం పరిమళ కుమారి డీఈఓకు వివరించారు. పాఠశాలను క్రమశిక్షణతో, విద్యార్థుల అభ్యున్నతికి అనుగుణంగా నిర్వహిస్తున్న తీరు ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తుందని డీఈఓ మహబూబ్ బాషా ప్రశంసించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ అధికారి పి. రాంబాబు, జీసీడీవో ఏఎస్ఎస్ రమాదేవి, ఎంఈఓ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్ఏల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

11వ రోజు దీక్షా శిబిరానికి చిర్ల జగ్గిరెడ్డి సంఘీభావం




**కొత్తపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏలు) తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన దీక్షలు 11వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో కొత్తపేట మెయిన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరాన్ని డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శనివారం సందర్శించారు. వీఆర్ఏలకు సంఘీభావం తెలిపి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన వీఆర్ఏలు సంఘాల అధ్యక్షులు భీమశంకర్, సత్యనారాయణ, ఇస్సాక్, లవరాజు తదితరుల ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ 11 రోజులుగా ఎండ, వర్షాలను లెక్కచేయకుండా వీఆర్ఏలు తమ న్యాయమైన హక్కుల కోసం దీక్ష చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించేలా ప్రభుత్వం వీఆర్ఏ సంఘాలతో చర్చలు జరపాలని కోరారు.గ్రామస్థాయిలో ప్రభుత్వ పరిపాలన, సంక్షేమ పథకాల అమలులో వీఆర్ఏలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలను చేరవేయడం, ఇళ్ల స్థలాల పరిశీలనలో సహకరించడం, ప్రభుత్వ భూములు, ఆస్తుల పరిరక్షణ, రెవెన్యూ వ్యవస్థకు సంబంధించిన వివిధ కార్యక్రమాల్లో వారు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. కరోనా సమయంలోనూ, తుఫాన్లు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ ప్రజలకు సేవలు అందించారని అన్నారు.వీఆర్ఏలు కోరుతున్న పే స్కేల్ అమలు, నామినీల రెగ్యులరైజేషన్, అర్హత కలిగిన వారికి ప్రమోషన్లు కల్పించడంతో పాటు ఇతర న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని చిర్ల జగ్గిరెడ్డి కోరారు. ప్రస్తుత నిత్యావసరాల ధరలు, కుటుంబ ఖర్చుల నేపథ్యంలో గౌరవ వేతనం సరిపోవడం లేదని, గ్రామస్థాయిలో నిరంతరం విధులు నిర్వహిస్తున్న వీఆర్ఏలకు గౌరవప్రదమైన వేతనం అందించాల్సిన అవసరం ఉందన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం గుర్తు చేసుకుని వీఆర్ఏలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సమస్యలను రాజకీయ కోణంలో కాకుండా మానవతా దృక్పథంతో పరిష్కరించాలన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం వీఆర్ఏలు అర్ధనగ్న ప్రదర్శనలు, వరద నీటిలో నిరసనలు వంటి కార్యక్రమాలు చేపట్టాల్సిన పరిస్థితి రావడం ఆవేదనకరమన్నారు.వీఆర్ఏల న్యాయమైన డిమాండ్ల సాధనకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందని చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి వీఆర్ఏ సంఘాలతో చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

## నగర పంచాయతీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి.

* ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు.



**కిర్లంపూడి, పెన్ పవర్,సెప్టెంబర్, 26:** ఏలేశ్వరం నగర పంచాయతీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు అన్నారు.కిర్లంపూడి ముద్రగడ నివాసంలో ముద్రగడ గిరిబాబు సమక్షంలో ఏలేశ్వరం నగర పంచాయతీ ముఖ్య నాయకులతో కలిసి రాబోయే స్థానిక ఎన్నికలపై సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు ఏలేశ్వరం నగర పంచాయతీ నాయకులకు ఎన్నికల్లో విజయం దిశగా పాటించాల్సిన వ్యూహాలపై, బూత్ స్థాయి బలాన్ని పటిష్టం చేసుకోవడంపై స్పష్టమైన దిశా నిర్దేశం చేశారు. నాయకులు, కార్యకర్తలు సమిష్టి కృషితో ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం నగర పంచాయతీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ వనిత ప్యారెట్స్ సేవా కార్యక్రమాలు ప్రశంసనీయం

వాసవి క్లబ్ గవర్నర్ బోడా వీర్రాజు ప్రశంస



**ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**పెదపళ్ళ వాసవీ క్లబ్ వనిత ప్యారెట్స్ సేవలు ప్రశంసనీయమని వాసవీ ఇంటర్నేషనల్ 215 జిల్లా గవర్నర్ బోడా వీర్రాజు అభినందించారు. శనివారం ఆయన అధికారిక పర్యటనలో భాగంగా బీటెక్ విద్యార్థి తమ్మిన మణికంఠకు రూ.50వేల స్కాలర్షిప్ అందజేశారు. పేదవారికి నూతన వస్త్రాలు, కిరాణా సరుకులు అందజేశారు. చింతలూరు గో పరంధామం గోశాలలో గోవులకు రూ.3 వేలు దాణా నిమిత్తం అందజేశారు. శ్రీ నూకాంబికా అమ్మవారి ఆలయంలో కూచిపూడి నేర్చుకుంటున్న 25 మంది విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు స్టేషనరీ అందజేశారు. కూచిపూడి ఉపాధ్యాయిని కళ్యాణిని ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ కంచర్ల మంగాదేవి, సెక్రటరీ పి విజయ, ట్రెజరర్ కె భారతి, జాయింట్ సెక్రెటరీ కె పావని, వైస్ గవర్నర్ పి. నారాయణమూర్తి, క్యాబినెట్ సెక్రటరీ కె మల్లిక, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## చింతలూరు నూకాంబికా అమ్మవారికి పౌర్ణమి అభిషేకం






**ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**ప్రముఖ పుణ్యక్షేత్రమైన చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయంలో భాద్రపద మాసం పౌర్ణమి సందర్భంగా కృష్ణానదీ జలాలతో అమ్మవారికి విశేషంగా అభిషేకం నిర్వహించారు. గత మాసంలో గోదావరి జలాలతో పౌర్ణమి అభిషేకాన్ని ప్రారంభించారు. ఈ నెలలో కృష్ణాజలాలతో అభిషేకం నిర్వహించినట్లు ఆలయ ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరి తెలిపారు. పెద్దింటి మణికుమార్ శర్మ బ్రహ్మోత్సవంలో ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కృష్ణా జలాలతో అభిషేకం నిర్వహించారు. తదుపరి కుంకుమార్చనలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వీరి అప్పారావు, ఆసాదులు మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సీసీటీఎన్ఎస్ అప్లికేషన్లపై పోలీసు అధికారులు, సిబ్బందికి శిక్షణ





**కాకినాడ, సెప్టెంబర్ 26 పెన్ పవర్:** కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో సీసీటీఎన్ఎస్ (క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్)లోని వివిధ అప్లికేషన్ల వినియోగంపై పోలీసు అధికారులు, సిబ్బందికి శనివారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డా. మహంతి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. స్టేషన్ రైటర్లు, అసిస్టెంట్ రైటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇన్‌స్పెక్టర్ కార్యాలయ రైటర్లు, డీఎస్పీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ శిక్షణలో కేసుల నమోదు, కేసుల పురోగతికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నవీకరించడం, పోలీస్ స్టేషన్లలో డిజిటల్ రికార్డుల నిర్వహణ, సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల వివరాల నమోదు, సంబంధిత అప్లికేషన్ల వినియోగంపై అవగాహన కల్పించారు. డిజిటల్ విధానంలో సమాచారాన్ని భద్రపరచడం, అవసరమైన సమయంలో సమాచారాన్ని సులభంగా పొందడం వంటి అంశాలపై ప్రాయోగిక శిక్షణ అందించారు. పోలీసు శాఖలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడం, సీసీటీఎన్ఎస్‌లో సమాచారాన్ని ఖచ్చితంగా, సకాలంలో నమోదు చేయడం, డిజిటల్ రికార్డుల నిర్వహణను మెరుగుపరచడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు పోలీసు విధుల నిర్వహణలో వేగం, పారదర్శకత, సామర్థ్యాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.

## శ్రీరామ్ నగర్ లో శ్రీసిద్ధి వినాయకునికి ప్రత్యేక పూజలు



**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 26:**అంబాజీపేట డైలీ మార్కెట్ వెనుక గల శ్రీ వరసిద్ధి వినాయక స్వామి కి శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా ప్రతిష్ఠించిన శ్రీ సిద్ధి వినాయక స్వామికి శనివారం నైవేద్యాలు సమర్పించిన అనంతరం భక్తులకు అన్న సమారాధన జరిగింది.ఆలయ ప్రధాన అర్చకులు పోడూరి శ్రీనివాసరావు స్వామివారికి 14 వ రోజు ఆదివారం అత్యంత వైభవంగా స్వామివారి నివజన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మహిళలు, యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనవలసినదిగా కోరారు. స్వామివారి ఊరేగింపులో భక్తి గీతాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. అన్న సమారాధన అనంతరం అనంతరం స్వామి వారి లడ్డు వేలంపాట జరిగింది. మొదటి లడ్డూను కుకునూరి కోటేశ్వరరావు (కోటేష్ కిరాణా అండ్ జనరల్ మర్చంట్ అంబాజీపేట)రూ .18,300 లకు, రెండవ లడ్డూ ను జోగి కృష్ణ చైతన్య, జోగి వీర వెంకట నాగ సత్యనారాయణ (మధు ట్రేడర్స్ అంబాజీపేట) రూ.6669 లకు హెచ్చు ధరకు పాడుకున్నారు.

## 'చలో విజయవాడ'కు జిల్లా నుంచి అనుమతి లేకుండా తరలివెళ్లొద్దు



**నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు**

**ఎస్పీ బిందు మాధవ్**

**కాకినాడ, సెప్టెంబర్ 26 ,పెన్ పవర్:** సెప్టెంబర్ 27న విజయవాడలో స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'చలో విజయవాడ' కార్యక్రమానికి కాకినాడ జిల్లా నుంచి అనుమతి లేకుండా ఎవరూ తరలివెళ్లరాదని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. జిల్లాలో ప్రస్తుతం వరద పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు, సహాయక చర్యలు, ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస ఏర్పాట్లు వంటి అత్యవసర విధుల్లో నిమగ్నమై ఉన్నారని ఎస్పీ తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ పోలీసు, రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖలకు సహకరించాలని కోరారు. అనుమతి లేకుండా ధర్నాలు, నిరసన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు తరలివెళ్లడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, పోలీసుల ఆదేశాలను ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అవసరమైన సందర్భాల్లో అరెస్టులు కూడా ఉంటాయని హెచ్చరించారు. ఉద్యోగులు,ప్రజలు ప్రస్తుత పరిస్థితులను అర్థం చేసుకుని పోలీసులకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## మండల ప్రజాపరిషత్ ప్రత్యేక అధికారిగా లక్ష్మీ ప్రత్యూష బాధ్యతలు స్వీకరణ



**ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ప్రకారము జిల్లా గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ డి.లక్ష్మీ ప్రత్యూష మండల ప్రజా పరిషత్ ప్రత్యేకాధికారిగా శనివారం బాధ్యతలు స్వీకరించారు.దీంతో ఎంపీడీవో ఏ.రాజు ఆధ్వర్యంలో ఆమెకు ఘన స్వాగతం పలికి, దుస్సాలువ, ఇండోర్ ప్లాంట్ అందజేసి,అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల ప్రజా పరిషత్ ప్రజా ప్రతినిధుల పదవీకాలం ఈనెల 24 తో ముగిసిందన్నారు. దీంతో మండల పరిషత్తులకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ పదవీకాలం స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి ప్రజా ప్రతినిధులు బాధ్యతలు స్వీకరించేంతవరకు కొనసాగుతుందన్నారు. అప్పటివరకు మండల అభివృద్ధికి స్థానిక అధికారులు, కూటమి నాయకులు సమన్వయంతో వ్యవహరిస్తూ సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో మెహర్ ప్రకాష్, ఇంచార్జ్ డిప్యూటీ ఎంపీడీవో యు.రేణుక, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సతీష్, కంప్యూటర్ ఆపరేటర్ వలీ,నాయకులు నెక్కంటి సూర్య ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com